ప్రజాశక్తి

Vol. 1, no. 27

(Dec. 16, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 27

(Dec. 16, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6 **PRAJA SAKTI** Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 16-12-42 బెజవాడ | సంచిక 27

★ మన రాజకీయాలు

"మేము ఏకమౌతున్నాం; ప్రపంచమంతా మాది!"

నేటి ప్రపంచ పరిస్థితులలో ఏ దేశప్రజలైనా ఫాసిస్టు పెనుభూతాల కాహుతికాకుండా రక్షించుకోవాలంటే, యితర దేశాల ప్రజలతో చేయి - చేయి కలపాలి. బ్రిటిష్, అమెరికా ప్రజలు యీయదార్థాన్ని గుర్తించి, ఇండియా పట్ల యిదివరకెన్నడూ ప్రకటించని ఐక్యత ప్రకటిస్తున్నారు.

అమెరికా - ఇండియా

ఇండియా లీగ్ అధ్యక్షుడు, భారతీయులతో బ్రిటిషు ప్రభుత్వం రాజీ చేసుకొనియున్నట్లయితే యీపాటికి బర్మా తిరిగి జయించబడియుండేదని ప్రకటించాడు. వెండెల్ విల్కీ "ఈవినింగ్‌స్టాండర్డ్" అనే పత్రికలో యిలా వ్రాశాడు. "అనేక కోట్లమంది ప్రజలపై బ్రిటన్ చలాయించే అధికారం పట్ల చైనా-ఇండియా ప్రజలు గావించే ఆందోళనపట్ల, అమెరికనులు ఉపేక్షాభావం వహించడం లేదు. వారి సానుభూతి సహజంగా స్వాతంత్ర్యాన్ని కోరే ప్రజలపైపు వుంది. "అమెరికన్ పీస్ సొసైటీ"(అమెరికా శాంతిసంఘం)అధ్యక్షుడు, భారతదేశ స్వాతంత్ర్య హక్కును వెంటనే ప్రకటించవలసిన అవసరాన్ని తెలియజేస్తూ "న్యూయార్క్ టైమ్సు" పత్రికలో ఒక వ్యాసం వ్రాశాడు. చంగ్ - కై - షేక్ భార్య అమెరికాకు వచ్చిన కారణం వివరించుతూ వెండెల్‌విల్కీ "లుక్" అనే పత్రికలో ఒక దీర్ఘమైనవ్యాసం వ్రాశాడు. "ఆసియా ఖండ వాసులసమస్యలనుగురించి ఇండియాయొక్క భావ ప్రపంచంలో కల్గుతూన్న విప్లవాన్ని గురించి అమెరికన్లకు తెలియపర్చడానికి ఆమె వచ్చిం"దని విల్కీ వ్రాశాడు. పాశ్చాత్యులతో యెట్టి సంబంధంలేని స్వతంత్ర ప్రభుత్వాలను స్థాపించుకోవాలని ఆసియాఖండవాసులు యెంత ఉవ్విళ్ళూరుతున్నారో రూజ్వెల్టు అధ్యక్షునికి ఆమె రుజువు చేస్తుందని విల్కీ తెలియజేస్తున్నాడు. లిన్-యు-టాంగ్ అనే సుప్రసిద్ధ చైనా రచయిత ప్రాచీనకాలంనుంచి నేటి వరకు చైనా - ఇండియా దేశాల సంబంధాన్ని వివరిస్తూ ఒకపెద్ద గ్రంథం వ్రాశాడు.

లండన్‌లో "ఇండియావారం"

లండన్‌లో ఇండియాలీగ్ జనవరి 24 మొదలు 31 వరకు "ఇండియా వారం" జరపడానికి తీవ్రమైన సన్నాహాలు చేస్తూంది. "సొసైటీ ఆఫ్ ఫ్రెండ్స్" (మిత్రుల సంస్థ) తరఫున, భారతదేశంలో వివిధ రాజకీయపార్టీల మధ్య సంప్రతింపులు జరుగకుండా ఆటంకాలు కల్పిస్తూన్న ప్రభుత్వవిధానాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన గావించబడింది. ఇండియా ప్రభుత్వం తరఫున ఇంగ్లండులో హైకమీషనరుగావున్న అజిజుల్‌హక్ సహితం తన రేడియో ఉపన్యాసంలో భారతీయుల పట్ల బ్రిటిష్ ప్రజల సానుభూతిని గురించి అంగీకరించవలసి వచ్చింది.

వైస్రాయికి మరొక 6 నెలలు

ఈ ప్రజాందోళనకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తట్టుకోలేకపోతున్నారు. ఇప్పుడు ఇండియాలో వీరవలంబిస్తూన్న నిరంకుశ విధానాన్ని కొనసాగించడానికి మరొక వైస్రాయి దొరకక యిప్పుడున్న లిన్‌లిత్గో ప్రభువుకు గడువు మరొక 6 నెలలు పొడిగించబడింది. "బ్రిటన్‌లో గాని, బ్రిటిష్ కామన్వెల్తులో గాని, ఇండియన్ వైస్రాయి యొక్క బాధ్యతలు నెరవేర్చగల వ్యక్తి ఒక్కడుకూడా దొరక్కపోవడం విచారించవలసిన విషయం" అంటూ, 'స్పెక్టేటర్' పత్రిక (లిబరల్) వ్రాసింది. ఈ 6 నెలలలో నైనా వైస్రాయి భారతదేశపు విషమావస్థను తొలగించవలసి యుంటుందని డెయిలీ హెరాల్డు (లేబర్) పత్రిక హెచ్చరించింది. "టైమ్సు" వంటి ప్రభుత్వానుకూల పత్రిక సహితం, "ఇకముందు మాత్రం ఈ విధంగా గడువులు పొడిగించ"రాదని వార్నింగ్ యిచ్చింది.

ఇండియాకు అమెరికన్ రాయబారి

అమెరికాప్రభుత్వం కూడా ప్రజల ఆందోళనను గుర్తించవలసి వచ్చింది. సర్ విలియమ్ ఫిలిప్స్ అనే రాజకీయవేత్తను ఇండియాకు రాయబారిగా పంపి, అమెరికన్ ప్రజల్ని సంతృప్తిపరచాలని చూచింది. కాని, ఆ ప్రజలంత సులభంగా మోసపోరు. భారతదేశ సమస్య పరిష్కరించబడితేనే తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుకూడా నిలుస్తాయని వారికితెలుసు.

జపాన్‌దాడికి సన్నాహాలు

ఈనెల 10 వ తేదీని మరొకసారి చిట్టగాంగ్‌పై జపాన్ విమానాలు దాడిచేశాయి. అస్సాం అడవులలో కొన్ని జపాన్ విమానాలు పడగొట్టబడ్డాయి. ఇండియా, ఆస్ట్రేలియా దేశాలపై దాడిచేసే ఉద్దేశాన్ని తాము వదలుకోలేదని "టైరికూ-షింపో"అను జపాన్ మిలిటరీ పత్రిక వ్రాసింది. ఈ ప్రమాదాన్ని మన దేశంలో వివిధ రాజకీయపార్టీలు గుర్తించాయి. భారతదేశ ప్రతిష్టంభన తొలగించబడకపోతే, కొత్త వైస్రాయి వచ్చినా, పాత వైస్రాయి ఉన్నా ఒకటేనని యు. పి. ముస్లింలీగ్ అధ్యక్షుడన్నాడు. ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని మితవాద నాయకుడైన సెతల్వాడ్ తీవ్రంగా నిరసించాడు. నిర్బంధవిధానం వల్లనే బ్రిటిష్ సామ్రాజ్యం అస్తమిస్తుందని పురుషోత్తందాస్ ఠాకూర్‌దాస్ అను వాణిజ్యప్రముఖుడు బొంబాయిలో ఉపన్యసించాడు. ప్రభుత్వాన్ని ఖండించడం మాత్రమే గాక, వివిధరాజకీయ పార్టీల నాయకులు ఐక్యతకై కృషిచేస్తున్నారు. ప్రత్యేకజాతుల స్వయంనిర్ణయ హక్కును గుర్తించి, జాతీయైక్యతకై ప్రజాందోళన అవసరమని అల్లాబక్ష్ (అజాద్ ముస్లిమ్‌బోర్డు అధ్యక్షుడు) ప్రకటించాడు. అలహాబాద్‌లో సమావేశమైన నాన్‌పార్టీస్ కాన్ఫరెన్సులో వివిధరాజకీయపార్టీల నాయకులు ఒడంబడికకు తీవ్రంగా కృషిచేస్తున్నారు.

ఇండియా ప్రభుత్వ సభ్యుడైన ఎన్. ఆర్. సర్కార్ బొంబాయిలో ఉపన్యసిస్తూ జాతీయ ప్రభుత్వం వుంటేనే కొన్నిసమస్యలు పరిష్కరింపబడుతాయని అంగీకరించాడు.

చర్చిల్ ప్రధాని కంటూన్న కలలు

ఒకవైపు ప్రపంచ పరిస్థితులు విపరీతంగా మారిపోతుంటే చర్చిల్ ప్రధాని తన సామ్రాజ్యాన్ని గురించి కంటూన్న కలలుచూస్తే జాలివేస్తుంది. జపాన్ ఆక్రమిత దేశాలకతడొక సందేశం పంపుతూ, బ్రిటిష్‌వారు, చైనావారు, బర్మన్లు, మలయన్లు, భారతీయులు కలిసి జపాన్‌దాడికి పూర్వం ఒక ఉన్నతాభ్యుదయం వైపు నడిచేవారమనీ, కాని త్వరలోనే జపానును ఓడించి తిరిగి తమ గమ్యస్థానంవైపు వెళ్ళగలమనీ చెప్పాడు. కాటికి కాళ్లుచాచుకొని కూర్చున్న సామ్రాజ్యవాదానికి ప్రతినిధియగు చర్చిల్ యెండమావులవైపు పరుగులెత్తుతున్నాడు. లార్డ్ హాలిఫాక్సు (అమెరికాలో బ్రిటిషురాయబారి)కూడా యిదేవిధంగా ఉపన్యసించాడు. క్రిప్సు రాయబారం భగ్నంకావడానికి కారణం భారతీయులలో ఐక్యత లేకపోవడమేనని నిందించాడు.

మొత్తంమీద సామ్రాజ్యవాదులు ఉత్తర ఆఫ్రికాలో లభించిన విజయాలతో తలదిమ్మెక్కి, యుద్ధానికి పూర్వం తమకున్న సామ్రాజ్యాన్ని పునఃప్రతిష్ఠించుకోవాలని వువ్విళ్లూరుతున్నారు. భారతదేశ సమస్యను పరిష్కరించకుండా, తమకున్న మిలిటరీ బలంతో మాత్రమే ఇండియాను రక్షించవూనుకోవడంలో ఇంతకంటె మరొక ఉద్దేశం కనబడదు.

ఇటు, జాతీయవాదులలో కొందరు మిత్రరాజ్యాలకు వివిధరంగాలలో లభిస్తూన్న విజయాలకు ఉత్సాహం పొందడానికి బదులు హతాశులౌతున్నారు. ఇక భారతదేశానికి విముక్తి ఎక్కడ? అని నిరుత్సాహంతో కృంగిపోతున్నారు.

ఈ విధంగా, ఒకవైపు సామ్రాజ్యవాదులు తమ స్వలాభమే ప్రధానంగా పెట్టుకొని మిత్రరాజ్యాల విజయాన్ని ఆటంకపరచే పథకాను తొక్కుతున్నారు. మరొకవైపున జాతీయవాదులు సామ్రాజ్యవాదుల యెడల తమకున్న ద్వేషాన్ని ప్రధానంగా పెట్టుకొని ఫాసిస్టులు విజయం పొందడమంటే ప్రపంచమంతటికీ (భారతదేశంసహా) బానిసత్వం లభిస్తుందనే యదార్థాన్ని మరచిపోతున్నారు.

గుణపాఠం

వీటివల్ల మనం నేర్చుకోవలసిన గుణపాఠమేమిటి? మనలో సంపూర్ణమైన జాతీయైక్యత లేకపోవడమే యీ రోజున సామ్రాజ్యవాదుల బలం. ఈ బలంతోనే వారింకా తైతక్కలాడుతున్నారు. ప్రపంచ ప్రజా యుద్ధాన్ని నిరంకుశాధికారుల చేతుల్లోనుంచి మనం లాక్కోవాలంటే జాతీయైక్యత ఒక్కటే తగిన ఆయుధం. ఒక బ్రిటిషు విలేఖరి బొంబాయి క్రానికల్ పత్రికలో (3-12-42) యిలా వ్రాశాడు :– "ఇండియాలో ప్రజా సామాన్యం మేల్కొంటున్నారు. త్వరలోనే వారు ప్రపంచ సామ్రాజ్య వాదాన్ని నాశనం చేయబోతున్నారు. నా దేశీయులలో నాకెంత విశ్వాసం వున్నదో, భారతీయులలో కూడా అంత విశ్వాసం వుంది. ఎందువల్లనంటే, నేను ప్రజలలో నుంచి వచ్చినవాణ్ణి. నాయకులకు, విద్యాధికులకు, ప్రణాళికలు ప్రచురించేవారికి నేను ఎలుగెత్తి చాటేదేమంటే - బలీయమైన మా చేతులన్నీ పైకి లేస్తున్నాయి. భారతీయులు, చైనా ప్రజల, రష్యన్ల, బ్రిటిష్ ప్రజల, అమెరికన్ల, వేయేల ప్రపంచ ప్రజ లందరి చేతులు పైకి లేస్తున్నాయి. మమ్మల్ని బంధించే సంకెళ్ళను మేము బద్దలుకొట్టబోతున్నాం. మేము యేకమౌతున్నాం. ప్రపంచం అంతా మాది."

— కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ

15-12-42.

ప్రజాశక్తి

16-12-42 బుధవారం

అధికధరలు: ప్రభుత్వ కర్తవ్యం

యుద్ధఫలితంగా జీవితావసరాల ఖరీదులు రెట్టింపుకు పైగా పెరిగిపోయాయి. ప్రభుత్వం సరసమైన ధరలకు అవసరమైన వస్తువులన్నిటిని అందజేసే విధానం ఏదీ అవలంబించలేదు. కొలది వస్తువుల ధరను పేరుకు కంట్రోలుచేసినా, అవి అమలుజరుగుటలేదు. అట్టి వస్తువులు దొంగమార్కెటులో విపరీతమైన ఖరీదులకు అమ్మబడుతున్నాయి. ఇది బహిరంగంగానే జరుగుతున్నా, ప్రభుత్వఉద్యోగులు ఉపేక్షవహించి యీ దోపిడిని సాగనిస్తున్నారు. ఉదాహరణకు, అవసరపదార్థాల ధరలు యీ విధంగా పెరిగాయి: బియ్యం బస్తా 1కి కుసుమలు 16 రూ. నుండి 26 రూ. పెరిగాయి. కందులు బస్తా1కి 12 రూ. నుండి 24 రూ. పెరిగాయి ఖర్చీ మణుగు 4రూ. నుండి 9½ రూ. పెరిగింది. జొన్నలు రూ.1కి 16 శేర్లనుండి 8 శేర్లకు తగ్గాయి. మంచినూనె వీశె 1కి 0-3-0 నుండి 0-7-6 కు, బెల్లం 0-4-0 నుండి 0-8-0 కు. పెరిగింది. 20 నెంబరు మామూలునేత కట్టుపంచలు 2 రూ. నుండి 4 రూ. లకు, సాదాచీరె 2 రూ నుండి 4 రూ లకు పెరిగాయి.

ఈ వస్తువులన్నీ ప్రజాసామాన్యానికంతటికీ కావలసిన జీవితావసరములే వీని ఖరీదులు ఇంతవిపరీతంగా పెరిగినపుడు, కొలది జీతాలపై బ్రతుకవలసిన కార్మికులు, గుమాస్తాలు, బడిపంతుళ్ల స్థితి దుర్భరమవుతూంది. అందుచే నెలకు 50 రూ. లోపు జీతాలు పొందుచున్నవారందరికి అధికధరల అలవెన్సులు యివ్వాలని కోరడం న్యాయసమ్మతమైనది. కాని ప్రభుత్వ మింతవరకు కార్మికులకు అధికధరల అలవెన్సులు యిప్పించడానికి తగిన చర్యదీసికోలేదు. అలవెన్సు యిచ్చిన రైల్వేవర్కర్ల, ప్రభుత్వోద్యోగుల విషయంకూడ సంతృప్తికరమైన పంథా అవలంబించలేదు. తక్కిన తరగతుల కార్మికులపని మరీ అధ్వాన్నంగావుంది. మ్యునిసిపల్ పనివారికి మనిషి 1కి రు 4-8-0 యివ్వాలని ప్రభుత్వం ప్రకటించిందేగాని ఒకటిరెండుచోట్లతప్ప తక్కిన ప్రదేశాలలో అమలుజరుపలేదు. మ్యునిసిపల్ వర్కర్సు యూనియన్ బలంగావున్న బెజవాడవంటి పట్టణంలో కూడ ఎంత మొత్రపెట్టుకున్నా ప్రజాందోళనను ప్రభుత్వం పెడచెవిని బెట్టింది. ఇప్పటికీ ధరలు రెట్టింపు పెరిగిపోయినా బెజవాడలో మ్యునిసిపల్ వర్కర్సుకు రూ 3-0-0 అలవెన్సు మాత్రమే ఇస్తూంది. ఇది కూడ పాకీపనివారు వగైరా కొందరికి మాత్రమే. ఎలెక్ట్రికల్ పనివారు, బడిపంతుళ్లు వగైరాకు ఏమీ యివ్వడంలేదు. రాష్ట్రంలో అనేకచోట్లనుండి ఈ దారిద్ర్యాన్ని భరించలేక కార్మికులు సమ్మెకట్టేపరిస్థితులు ఏర్పడేలా వున్నాయని వార్తలు వస్తున్నాయి. పెద్దాపురం, గుంటూరు పట్టణాలలో సమ్మెనోటీసు కూడా యివ్వబడిందని తెలుస్తూంది.

పరిస్థితులింత క్లిష్టంగావున్న సమయంలో రాష్ట్ర మునిసిపల్ వర్కర్సు యూనియన్ ప్రభుత్వానికి కార్మికుల యిబ్బందులను తెలిపి, నివారణోపాయాలు సూచించడానికి డెప్యుటేషన్‌కు అనుమతి అడిగింది. కాని ప్రభుత్వానికి చీమకుట్టలేదు. డెప్యుటేషనుకు అనుమతి నిరాకరించింది. ఈ నెల 12 వ తేదీ గవర్నరు సలహాదారు బెజవాడ వచ్చినపుడు రాష్ట్రసంఘం మరల కార్మికుల కష్టాలను తెలుపడానికి ఇంటర్వ్యూ అడిగింది. కాని చేయవలసిందంతా తామే చేస్తున్నామని, ఇంటర్వ్యూ అనవసరమని నిరాకరించబడింది.

పరిస్థితులు నానాటికి విషమించుతున్నాయి. ప్రజాసామాన్యం పొట్టనింపుకోడమే దుస్సాధ్యమవుతుంది. లోలోన రగుల్కొంటున్న ఆకలిజ్వాలలను, ప్రభుత్వం అవలంబించుతున్న ఉపేక్షాభావం యెడల పెరుగుచున్న అసంతృప్తిని, నివారించాలి. లేదా ఏనిమిషమైనా బ్రహ్మాండమైన అశాంతిజ్వాలలు వ్యాపించవచ్చును. జపాన్ దుండగీడులు దేశ సరిహద్దునే కాచుకొని వున్నప్పుడు, దేశంలో అశాంతి ఎంత ప్రమాదకరమైనదో, దేశరక్షలకు ఎంత విధ్వంసకరమైనదో వేరే చెప్పనక్కరలేదు. ఈ స్థితిలో ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి, ఖరీదుల పెరుగుదల ననుసరించి కార్మికులకు అలవెన్సును రాబట్టడానికి, ప్రజాసేవకులు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వోద్యోగులు ముందంజ వేస్తున్నారు.

బెజవాడలో పట్టణకమ్యూనిస్టు కమిటీ ఆహారపదార్థాల కరువును గురించి బహిరంగసభ పెట్టడానికి అనుమతి అడిగితే, ఉద్యోగులు నిరాకరించారు. తాబెట్టరు, ఇతరుల బెట్టనివ్వరు; ఇలావుంది ప్రభుత్వోద్యోగులపని. బహిరంగంగా జరుగుతున్న దొంగమార్కెటు వ్యాపారాన్ని తాము అరికట్టుటలేదు. మాడుతున్న ప్రజలకు ఆహారపదార్థాలను సప్లయిచేయడానికి సంతృప్తికరమైన పద్ధతి అవలంబించుటలేదు. ప్రజాందోళన ఫలితంగా పెట్టించబడిన చౌకధరల డిపోలలో అమ్మేసరకు మంటిబెడ్డలతో నిండిన ముక్కిపోయిన బియ్యం. అదైనా రోజల్లా త్రొక్కులాటలో నిలబడితే, దొరకుతుంది. ఇవిబీదజనులు నివసించేప్రాంతాలలో సరిపడినన్ని స్థాపించకపోవుటచే ప్రజలెంతో బాధపడుతున్నారు. ఆకలితో గుమికూడే జనంపై పోలీసు దౌర్జన్యం కూడా పరిపాటి అయిపోయింది.

ఈ కరువుకంతకూ కారణం ఏమిటి? ఇండియా గవర్నమెంటు వర్తక సభ్యుడు నళినీరంజన్ సర్కారు మన దేశంలో పండే పంట మనకు చాలదనీ, విదేశాలనుండి వచ్చేదిగుమతులు యుద్ధంవల్ల ఆగిపోవడమేననీ చెప్పాడు. ఆయన చెప్పిన లెక్కల ప్రకారమే భారతదేశంలో వివిధరకాల ఆహారపదార్థాలు 6 కోట్ల టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. ఇవిగాక శాంతి సమయంలో 10 లక్షల టన్నులు దిగుమతిచేయబడేవి. ప్రభుత్వం ఒక ప్లాను ప్రకారం పంచి, క్లుప్తంగా వాడుకోడానికి రేషనింగ్‌పద్ధతి అమలుజరిపినట్లయితే, యీ కొలదిలోటును అట్టే కష్టపడకుండానే సర్దుకోడం సాధ్యమయ్యేది. కాని ప్రభుత్వ మట్టి విధానం అవలంబించలేదు. నెలలు, సంవత్సరాలు ఉద్యోగుల కాన్ఫరెన్సులు జరిపి, కొన్ని పదార్థాలపై మాత్రం ఎందుకూ పనికిరాని కంట్రోలు పెట్టింది. ఆ సరుకు బహిరంగంగా దొంగమార్కెటులో అమ్మబడుతూంటే, అధిక లాభాలకోసం దోచుకానే షాహుకార్లకు ప్రజలను అప్పగించి వూరుకుంది.

ఇంతేగాదు. ఎన్. ఆర్. సర్కారు ఉపన్యాసాన్నిబట్టి సెప్టెంబరు- నవంబరు నెలలమధ్య ఒక్కసింహళానికే భారతదేశాన్నుంచి 34 లక్షల టన్నుల ఆహారపదార్థాలు (బియ్యం) ఎగుమతి చేయబడ్డాయి. దేశంలో ప్రజల కనీస అవసరాలనైనను తీర్చడానికి సరియైన ప్రయత్నమేమీ చేయకుండా, విదేశాలకు ఆహారపదార్థాలను ఎక్కువ ధరకు కొని ఎగుమతిచేయడంకంటే మించిన అన్యాయం వుండబోదు. ప్రభుత్వం ఒకవైపున సక్రమమైన అధికధరల అలవెన్సుయిచ్చే ఏర్పాట్లుచేయక, ప్రజల కొనుగోలుశక్తిని కుంటుపరుస్తోంది. రెండోవైపున హెచ్చుఖరీదులకు విదేశాలకు ఎగుమతి కానిస్తూంది. అంటే, ఖరీదులు విపరీతంగా పెరగడానికి అవకాశమిస్తోంది. ఖరీదుల పెంపుదలను ప్రోత్సాహమిచ్చుటద్వారా డిమాండు తగ్గించాలనే పెట్టుబడిదారీ నీతి అవలంబిస్తోంది. ఈ పద్ధతి రెండువిధాల అరిష్టదాయకమైనది. ఖరీదులు క్రమంగా పెరుగుతాయి; ప్రజల కొనుగోలుశక్తి క్రమంగా తగ్గిపోతుంది. ఇప్పటివరకు ఈవిధంగానే జరుగుతూవచ్చింది. ప్రజల ఓర్పు, సహనం కడగొట్టుదశకు వచ్చాయి. ఇంకా ఈ పాలసీ కొనసాగితే, అశాంతిజ్వాలలు వ్యాపించే ప్రమాదం ఏర్పడుతుంది.

ఈ ప్రమాదాన్ని అరికట్టడానికిప్రజాసేవకులందరూ పూనుకోవాలి. ప్రభుత్వం ప్రజల ఈ క్రింది కోర్కెలు తీర్చేలా ఒత్తిడిచేయాలి. న్యాయమైన ఈ ప్రజాకోర్కెలపై ప్రజలందరిని ఐక్యమొనరించాలి :—

1. ధరల పెరుగుదల ననుసరించి 50 రూ. లోపు జీతగాండ్రందరకు అలవెన్సు వృద్ధిచెయ్యాలి.

2. జీవితావసరాలైన వస్తువుల ధరలన్నిటిని కంట్రోలుచెయ్యాలి. దొంగమార్కెటు వ్యాపారాన్ని అరికట్టి, అలా అమ్మేసరుకును ప్రభుత్వం స్వాధీనం చేసికొని, కంట్రోలు ధరలకు అమ్మించాలి.

3. రైతులు, చేతిపనివారు అమ్మేసరుకులకు కనీసధరలనుకూడ నిర్ణయించి, మధ్య దళారీలు విపరీత లాభాలుపొందడాన్ని అరికట్టాలి. స్పెక్యులేషన్ను (వాయిదా బేరాలు) నిషేధించాలి.

4. జిల్లాలలో, రాష్ట్రాలలో, భారతదేశం అంతటిలోనుప్రజలకు అవసరవస్తువులు ఒక ప్లానుప్రకారం అందచేయగా మిగిలిన వాటినే రవాణాచేయాలి. తక్కువైన వస్తువుల రవాణా నిషేధించి, రేషనింగుద్వారా ప్రజలందరికి సమానంగా అందునట్లు చేయాలి.

5. ఇపుడున్న చౌకడిపోలను విస్తరింపజేసి, బీదలందరకు అందుబాటులో వుండునట్లు చేయాలి.

పై ప్రజాకోర్కెలను సాధించడానికి కమ్యూనిస్టులు అగ్రగాములుగావుండి, ప్రజాసేవకుల, దేశభక్తులందరి సహకారాన్ని సంపాదించుతారు. అన్నిరాజకీయపార్టీల సహాయాన్ని పొందుతారు. ప్రజలురోజురోజు హక్కులకొరకై నిర్మించబడేయిలాంటి ప్రజాఐక్యతయేజాతీయ ప్రజాఐక్యతను వృద్ధిచేయడానికిసోపానమవుతుంది. దీనిద్వారా నిరంకుశాధికార ప్రభుత్వంయొక్క చేతగానితనం బట్టబయలవుతుంది. జాతీయ ప్రభుత్వ స్థాపనకు, జపాన్ దురాక్రమణ నెదిరించడానికి, ప్రజలు అగ్రగాములవుతారు.

★★

పార్టీఫండు వసూళ్ళు (12-12-42 వరకు)

జిల్లా	ఆభరణాలు కాక మొత్తం	జిల్లా	ఆభరణాలు కాక మొత్తం
విశాఖపట్నం	28- 2-0	చిత్తూరు	15- 7-0
తూర్పు గోదావరి	784- 8-0	కడప	12- 0-0
పశ్చిమ గోదావరి	78-10-0	అనంతపురం	60- 6-0
కృష్ణ	4071- 1-1	కర్నూలు	66- 0-0
గుంటూరు	10978-10-9	రైల్వే	119- 0-0
నెల్లూరు	5040-14-6	రాష్ట్ర కమిటీ	13432- 8-0
		మొత్తం	34687- 3-4

న్యాయశాస్త్రమా? ★

రచన: యశపాల్

అనువాదం: మోటూరి కోటేశ్వరరావు

సాయంకాలం 6 గంటలు రాకపోకలు ఆగిపోయాయి. అంగళ్ళలో గ్రామఫోను సంగీతముగాని, చిల్లర వర్తకుల కేకలుగాని వినబడవు. అంతా భీతికొల్పే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో ధర్మరక్షకులు, న్యాయపాలకులు ఐన పోలీసువాళ్ల బూటధ్వని రోడ్డుమీద వినబడుతుంటుంది. నిశ్శబ్దంలోఆధ్వని మరింతభయంకరంగావుంటుంది.

ఇదంతా కర్ఫ్యూ అర్డర్ (Curfeworder) మహిమ. అంటే సాయంత్రం 6 గంటలు నుంచి ఉదయం 6 గంటలు వరకు ఏపనిమీదనైనాసరే ఎవ్వరూ బజారులోకి రాగూడదు. వస్తే - చావో, జైలో.

అవి మతకలహాలరోజులు. కొట్లాటలు కొంచెం సర్దుకున్నాయి. అది నగరవాసులువారికి కావలసిన వస్తుసముదాయాన్ని కొనుక్కునే సాయంకాలసమయం ధక్కా నగర జీవితము న్యాయశాస్త్రాధికారంతో అంత మొందింది. అసలు అవి వర్తకమాంద్యపు రోజులు. ధరలు పడిపోయినవి. అందులో ఈ కర్ఫ్యూ ఆర్డరు వచ్చి తమ కొద్దిపాటి వ్యాపారాన్ని నాశనంజేయటం చిల్లరవర్తకులు ఏమాత్రం సహించజాలకున్నారు. 'కర్ఫ్యూ ఆర్డర్' తమకొరకే ప్రవేశపెట్టారేమోనని విచారించారు.

లాలారామ్‌శరన్ మతకలహాలకు కారకులయి, 'కర్ఫ్యూ అర్డర్'ను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వానికిఅవకాశం కల్పించినవాళ్ళనితిట్టాడు. ఎన్నో శాపనార్థాలు పెట్టాడు. కర్ఫ్యూఅర్డరు పెట్టి తనకు జీవనోపాధియైన కొద్దిపాటి వ్యాపారాన్ని పోగొట్టినందుకు ప్రభుత్వాన్ని అసహ్యించుకొన్నాడు. తన దురదృష్టాన్ని తానే ఏవగించుకున్నాడు. వెన్నెలకొరకు వువ్విళ్లూరుతూ ఎదురుచూస్తుండే చక్రవాక పక్షుల్లాగ, దుకాణదారులకు రాత్రి 9 వరకూ, కాతాదారులకొరకు తహతహలాడుతూ, దార్లు చూస్తూవుండటం ఒక ఆనందం. కాని ఇప్పుడో సాయంత్రం 6 గంటలకే అంతా బందోబస్తీ. రామ్‌శరన్ తన దురదృష్టానికి విచారపడుతూ పెందలకడే భోజనంజేసి మేడపైన తన మంచంమీదపండుకున్నాడు హుక్కాపీలుస్తూ. అతని మంచం ప్రక్కనే సరకులు వచ్చిన ఖాళీపెట్టెలు, వాటిలోని గడ్డి పడివున్నాయి. విధివైపరీత్యము! ఏ మలయమారుతమైతే రామ్‌శరనును నిద్రాదేవత ఒడిలోనికి రవాణాచేసిందో, ఆ మందమారుతమే హుక్కాలోని ఒక చిన్న అగ్నికణాన్ని చెంతనేవున్న గడ్డిపెట్టెమీదకు విసరింది. పొగలు గ్రక్కుచున్న అగ్నివేడిమిచే రామ్‌శరన్ సుఖనిద్రనుంచి హఠాత్తుగా మేల్కొని, "నిప్పు! నిప్పు!" అని కేకలు వేశాడు.

చుట్టుప్రక్కల ఇళ్లనాలా దగ్గరేవున్నాయి. రామ్‌శరన్ అద్దెఇల్లు మూడంతస్థుల మేడయగుటచే ఇరుగు పొరుగు సహాయము చేయలేకపోయారు. క్రియ శూన్యమైనప్పటికీ, సలహా మాత్రం వర్షించినయి చుట్టుప్రక్కలనుంచి రామ్‌శరన్ మీద. వీటితో అతనిబుర్ర దిమ్మెత్తిపోయింది.

అతని ఇంట్లోవున్న నీరంతా ఆ మంటల దాహాన్ని తీర్చలేకపోయింది. నీటి మిషన్ రాత్రి 9 గంటలకే కట్టేశారు అధికారులు. పిల్లలు, తల్లి గోలపెడుతూ రామ్‌శరన్ దగ్గరకు వచ్చి అతన్ని మరీ గాభరా పెట్టసాగారు. ప్రక్క ఇంటినుంచి ఒకశబ్దం పిల్లలగోలలోంచి దూసుకొని వచ్చి రామ్‌శరన్ చెవిలో దూరింది. "అగ్నిమాపకదళం వారికి ఫోన్ చెయ్యండి" అని. బజారులోని టెలిఫోను ఆఫీసుకు వెళ్లబోయిన రామ్‌శరన్ వీధి గుమ్మములో 'టక్'మని హఠాత్తుగా ఆగిపొయ్యాడు. కర్ఫ్యూఆర్డర్ అతనికి గేట్ దగ్గర యముడిలా ప్రత్యక్షమైంది. ఇంట్లోనిప్పు, బయట కర్ఫ్యూఅర్డర్, ముందుసుయ్యి, వెనుకగొయ్యి ఏమీతోచక వస్లకాలిన పిల్లిలా ఇంట్లోకి బయటికి తిరిగాడు. చివరకు నిరాశాపూరిత ధైర్యంతో టెలిఫోన్ ఆఫీస్‌కోసం బజారుకి వెళ్లాడు.

'ఆగు!' అంటూ ఒకకర్కశస్వరం రామ్‌శరన్‌కు వినబడింది. వెంటనే అతడు తన ముందు ఒక సిపాయిని చూచాడు. 'అగ్!' 'అగ్!' అని హిందూస్థానీలో అరుస్తూ తన ఇంటివైపు చూపించి త్వరగా వెళ్లబోయాడు రామ్‌శరన్. 'ఏయ్' 'ఆగు'! అని తెల్లదొర తుపాకి చూపిస్తూ అన్నాడు. భూమి కంపించినట్లయింది. రామ్‌శరన్ కళ్లు గిర్రున తిరిగిపోయినాయి, ముందు తుపాకి, వెనక నిప్పంటుకొన్న ఇల్లూ చూచి.

'అగ్, హుజూర్! మేరేబచ్చే' అన్నాడు రామ్‌శరన్ గజగజ వణుకుతూ.

ఒకరి భాష ఒకరుతెలసికోలేరు. సార్జెంటు దొర రామ్‌శరన్‌ను అర్థం చేసుకోలేడు. రామ్‌శరన్‌కు సార్జెంటు భాష తెలియదు. సార్జెంటు రామ్‌శరన్‌ను "ప్యాస్" (Pass) అడిగాడు. రామ్‌శరన్ సార్జెంటును "పర్‌మిషన్" (Permission) అడిగాడు.

గస్తీ తిరుగుతూవున్న మిలిటరీ లారీలో రామ్‌శరన్ పోలీసుస్టేషన్‌కు పంపబడ్డాడు. లారీలోవున్న నల్లదొర (మన దేశస్థుడు)తో మొరపెట్టుకొన్నాడు, రామ్‌శరన్ తనదుస్థితిని గురించి. ప్రయోజనము లేకపోగా రామ్‌శరన్‌కు ఒక చెంపకాయ ఇచ్చాడు మన నల్లదొర.

బయలుదేరిన రెండుగంటలకు లారీ ఇంకా 15 మంది నేరస్థులతో పోలీసుస్టేషన్ చేరింది. బందీలంతా ఒకవరసగా నిలబెట్టబడ్డారు క్రాసు పరీక్షకోసం. రామ్‌శరన్ "అగ్నిమాపకదళానికి" (Fire brigade) కి కబురుచేయమని పదేపదే బ్రతిమలాడాడు పోలీసు అధికారుల్ని. పోలీసు అధికారులు "లా అండ్ ఆర్డరు" (Law and order) కాపాడి గవర్నమెంటు అధికారాన్ని అమలు జరపడానికి నియమించబడ్డారు గాని, ఇళ్లకు నిప్పంటించుకొని బజారుల్లోతిరిగే ప్రజలకు సహాయపడటానికిగాదు.

మాట్లాడితే చావ బాదుతామని పోలీసులు బెదరించారు. కాని రామ్‌శరన్ తన ఆదుర్దాను ఆపుకోలేకపోయాడు ప్రార్థించాడు దయచూపమని. కరుణించమని మ్రొక్కాడు, తన ఇంటినీ, పిల్లల్నీ రక్షించుకొనడానికి. అగ్నిజ్వాలలతో నిండివున్న తన ఇంటిని తలచుకొనేటప్పటికి, అతనిమనస్సులో పెద్దతుపానులేచింది. ఈ గోలంతా సహించలేక పోలీసు ఇన్‌స్పెక్టరు, పోలీసులచేత రామ్‌శరన్‌ను స్పృహతప్పేటట్లు తన్నించాడు.

కొంతసేపటికి రామ్‌శరన్‌కు స్పృహతెలిసింది. కాని, పోలీసులు అడిగే ప్రశ్నలకు జవాబిచ్చుటకు మాటరావటంలేదు. కొంచెం చన్నీరుత్రాగి వంగిననడుముతో నెమ్మదిగాలేచి కూర్చున్నాడు. కాని అతడు ఇంకా మాట్లాడే స్థితికి రాలేదు.

"రాస్కెల్! నీతాతొచ్చి చెబుతాడనుకొన్నావా నీపేరు, వూరు, 'అగ్నిమాపకదళానికి' ఫోన్ చేసేదెట్లా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

చాలా కష్టంమీద రామ్‌శరన్ తన అడ్రసు చెప్పాడు. వెంటనే పోలీసు ఇన్‌స్పెక్టరు 'ఫైర్ బ్రిగేడ్'కు కబురుచేశాడు. ఆరాత్రంతా రామ్‌శరన్ పోలీసుస్టేషన్‌లోనే ఒకమూల విచారంతో పండుకుంటాడు.

మర్నాడు ఉదయము స్నేహితులు రామ్‌శరన్‌ను జామీనుమీద విడపించటానికివచ్చారు. కాని న్యాయాధికారి విచారణ చేయకుండానే నేరస్తులందరికీ 2 రూ జరిమానా లేక 1 వారం జైలు చొప్పున శిక్షనిధించాడు. రామ్‌శరన్ నేరస్థుడు కాడని, అతని ఇల్లు నిప్పంటుకొనుటచే 'ఫోన్' కొరకు బజారుకు వచ్చాడనీ, రామ్‌శరన్ ప్లీడరు వాదించడంచూచి న్యాయాధికారికి విసుగెత్తింది. మాజిస్ట్రేటు రామ్‌శరనును నేరస్తుడని శిక్షించలేకపోయాడు. అమాయకుడని వదలిపెట్టాలేదు. ఇంటికి నిప్పంటుకున్నప్పుడు 'కర్ఫ్యూ ఆర్డరు'ను ధిక్కరించి అతిక్రమించడాన్కి అధికారము న్యాయశాస్త్రము యివ్వలేదుగనుక.

రెండురూపాయల జరిమానా చెల్లించి కేసునుంచి బయటపడటం మంచిదా రామ్‌శరన్‌కు? లేకపోతే న్యాయం పొందటాన్కి ఇల్లుగుల్ల చేసే ప్లీడర్లనుపెట్టి హైకోర్టుకు అప్పీలుచేయటం మంచిదా?

(స్టూడెంట్‌నుండి)

ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్

ఆంధ్రశాఖ

అఖిలభారత ప్రోగ్రెసివ్ రైటర్సు అసోసియేషన్ వారిచే, ఆంధ్రశాఖ నేర్పరచుటకు, కన్వీనర్స్‌గా నియమింపబడినవారిచే మహాసభ తెనాలిలో జరుపుటకు నిర్ణయింపబడి, 4-12-42 న తెనాలిలో శ్రీ జి. వి. కృష్ణారావుగారి అధ్యక్షతను జరుపబడిన సమావేశంలో ఈక్రింది తీర్మానములు ఆమోదింపబడినవి.

1. ఆంధ్రరాష్ట్ర ప్రోగ్రెసివ్ రైటర్సు మహాసభను తెనాలిలో 1943 జనవరి రెండవ వారంలో జరుపుటకు—
2. ఈ క్రిందివారిని ఆహ్వానసంఘ కార్యనిర్వాహకవర్గ సభ్యులనుగా ఎన్నుకొంటూ, మరి కొందరిని చేర్చుకొనే అధికారం యిచ్చుటకు—

I. పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రిగారు, (అధ్యక్షులు)
II. రావి అమ్మయ్యగారు (ఉపాధ్యక్షులు)
III. చదలవాడ పిచ్చయ్యగారు (కార్యదర్శి)
IV. టి. గోపీచంద్‌గారు (స॥ కార్యదర్శి)
V. సోమయాజుల నీరజరావుగారు

3. ఆహ్వానసంఘ సభ్యత్వరుసుం రూపాయికి తక్కువ లేకుండా ఉండవలెనని—
4. మహాసభనాటికి ప్రోగ్రెసివ్ రచనలను ఒక సంపుటంగా ఆహ్వానసంఘం తరఫున ప్రకటించుటకు - తీర్మానించడమైనది.

★

ప్రణాళిక

★

భారతీయ సామాజిక జీవితంలో తీవ్రమైన మార్పులు జరుగుతున్నవి. అభివృద్ధి నిరోధకతత్వం, క్షీణించి అవసానదశలో వున్నప్పటికీ, పూర్తిగా నశించలేదు. పైపెచ్చు తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోడానికి విశ్వప్రయత్నాలు చేస్తూవుంది. పౌరాణిక సంస్కృతి కాలం గడిచిన తర్వాత, భారతీయ సారస్వతం యథార్థ జీవితాలనుంచి తప్పించుకుపోయి వినాశకరమయిన ధోరణిని అవలంబించింది. తర్వాత సాహిత్యం వాస్తవిక సంఘటనలను విసర్జించి నిరాధారమైన ఆధ్యాత్మికవాదం, ఊహాజనిత ఆదర్శవాదాన్ని పట్టుకొని వ్రేలాడింది. తత్ఫలితంగా భారతీయ సారస్వతం శుష్కించి నీరసించి, కరకు చాదస్తాలతోను, తప్పుడు ఆదర్శాలతోను నిండిపోయింది.

మన సమాజంలో జరుగుతున్న మార్పుల్ని గుర్తించి, వాటి అభివృద్ధిని ప్రతిబింబింపజేసే సాహిత్యాన్ని సృష్టించడం భారతీయ రచయితల విధి. సారస్వతంలో శాస్త్రీయమైన హేతువాదాన్ని చొప్పించి, దేశంలో వున్న అభివృద్ధికర శక్తులకు చేయూత నివ్వాలి. కుటుంబజీవితం, సమాజము, మతం, సెక్సు, యుద్ధం- మొదలైన సమస్యలమీద వ్రాయబడ్డ రచనలో కనబడే అభివృద్ధి నిరోధకతత్వాన్ని అరికట్టాలి. కుల మతకక్షలు, జాతివిద్వేషం, వర్గదోపిడి.... వీటిని పురిగొల్పే వ్రాతల్ని ప్రతిఘటించాలి.

ఈ బాధ్యతను నిర్వర్తించడానికి భారతీయ రచయితలు, సాహిత్య విమర్శనాదృష్టిని అలవరచుకొని, పెంపొందించుకొనవలసిన అవసరం ఎంతైనా వున్నది.

నేటివరకు సారస్వతం, తదితరకళలు, ధాందసవర్గాల చేతుల్లో నలిగి మలినమవుతున్నవి. వాటిని వారి ఆధిపత్యంనుంచి తప్పించడం, ప్రజాసముదాయానికి సన్నిహితపరచడం, జీవిత యాథార్థ్యాన్ని ఉన్నదున్నట్టుగా కనుబరచే శక్తివంతమైన సాధనాలుగా జేయడం, ఇవి ఈ సంఘంయొక్క ప్రధానోద్దేశ్యాలు.

భారతీయ నాగరికతలోని ఉత్తమ సాంప్రదాయాలకు వారసులమని నొక్కి చెపుతూ, మన దేశంలోని అభివృద్ధినిరోధకత్వాన్ని అన్నివిధాలా విమర్శిస్తాము. మనదేశం ఒక నూతన జీవితాన్ని లక్ష్యంగా పెట్టుకొని పాటుబడుతూవుంది. అందుకు తోడ్పడే ప్రతివిషయాన్ని వెలిబుచ్చడంద్వారాను, నూతన రచనల ద్వారాను ప్రోత్సహిస్తాము. ఇందుకు వలసిన దేశీయ, విదేశీయ, విజ్ఞానసంపదను వినియోగించుకుంటాము. మనభారతీయ సారస్వతం, ఆకలి, దారిద్ర్యం, రాజకీయ బానిసత్వం, సాంఘికంగా వెనుకబడడం—మొదలైన జీవితప్రధాన సమస్యల్ని చర్చించాలని విశ్వసిస్తున్నాము.

నిస్తబ్దత, కార్యశూన్యత, హేతువ్యతిరేకతలకు దించే ప్రతి రచనను అభివృద్ధి నిరోధకమైనదిగా తిరస్కరిస్తున్నాము.

ఆచారాల్ని, వ్యవస్థల్ని, హేతువాదంతో పరిశీలించడానికిన్ని, కార్యాచరణకు ప్రోత్సహించి, సంఘటనాశక్తిని అలవరచి, మార్పులు తేవడానికిన్ని తోడ్పడే విమర్శనాభావాన్ని మనలో ఉత్తేజింపజేసే ప్రతివ్రాతను అభివృద్ధికరమైనదిగా భావిస్తూ, దానిని స్వీకరిస్తున్నాము.

ఆశయాలు

(1) వివిధ ప్రాంతాల రచయితల సంఘాల్ని స్థాపించడం; సమావేశాలద్వారాను, సాహిత్య ప్రచురణద్వారాను, వివిధ సంఘాల పనిని సమన్వయించడం, రాష్ట్ర సంఘానికి, స్థానిక సంఘాలకు మధ్య సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచడం, ఈ సంఘంయొక్క ప్రధాన లక్ష్యాలకు ఆదర్శాలకు హాని కలుగకుండావుండే లక్ష్యాలుగల యితర సంస్థలతో సహకారం చేయడం.

(2) మన రాష్ట్రంలోని అన్ని ముఖ్యనగరాలలోను, జిల్లాల వారీగాను, ఈ సంఘంయొక్క శాఖల్ని ఏర్పరచడం.

(3) అభివృద్ధికర సాహిత్యాన్ని ప్రచురించడం; అభివృద్ధి నిరోధక సంస్కృతిని ప్రతిఘటించడం; ఈ విధంగా భారతీయ స్వాతంత్ర్య వుద్యమానికి, నూతనసమాజాభివృద్ధికి పాటుబడడం.

(4) అభివృద్ధికర రచయితల లాభక్షేమాల్ని కాపాడడం.

(5) ఆకోచానా స్వాతంత్ర్యం, అభిప్రాయ స్వాతంత్ర్యం, స్వేచ్ఛా ప్రచారహక్కును రక్షించడానికి పోరాడడం.

(6) రచన మన మాశించే దివ్యభవిష్యత్తుకు దారిటీనేదిగా జేయడం.

కన్వీనర్స్

చదలవాడ పిచ్చయ్య, శ్రీరంగం శ్రీనివాసరావు, తుమ్మల వెంకటరామయ్య, రాపీ మోహనరావు

★ ఇతర రాష్ట్రాలలో

యావద్భారతదేశంలోను జరుగుతున్న ఐక్యతా ఉద్యమాన్ని గురించి క్రిందటి సంచికలో కొన్ని రాష్ట్రాల రిపోర్టులను ఇచ్చాము. ఈవారం మిగతావి సింహావలోకనం చేదాం.

మహారాష్ట్ర-

అమల్నేర్ పట్టణంలో విధ్వంసకచర్యలు, ప్రభుత్వ నిర్బంధవిధానం, బొగ్గుసప్లయిలేక మిల్లు మూసివేయడం - వీటివల్ల పరిస్థితులు చాలా క్లిష్టమయ్యాయి. ఐనా ఐక్యతా ఉద్యమంలో కామ్రేడ్స్ ఉత్సాహంతో పనిజేశారు. 12 దళాలుగాఏర్పడి పట్టణంలోనూ, చుట్టునున్న గ్రామాలలోనూ పనిజేశారు. 11 వందల టిక్కెట్లు అమ్మారు. 3 వేల పార్టీ మ్యానిఫెస్టోలు పంచబడ్డాయి. రు. 100 లు విరాళాలు వసూలయింది. 'లోకయుద్ధ' పత్రిక 250 కాపీలు అమ్మారు. ఈ వారంలో కాంగ్రెసు నాయకుల విడుదలకావాలని, జాతీయప్రభుత్వం కొరకు దేశరక్షణ, జాతీయ స్వాతంత్ర్యం కొరకు జాతీయైక్యత నిర్మించాలనే నినాదాలు మిన్నుముట్టాయి. 4500 ప్రజలు సంతకాలు చేశారు.

ధూలియాలో కామ్రేడ్స్ 6 భాగాలు విభజించుకొని బోల్షివిక్ పోటీతో పనిజేశారు. 80 వీధిమూలసభలు జరుపబడ్డాయి. దేశభక్తులతో చర్చించి, వారి సందేహాలు తీర్చారు. జిల్లా కమిటీ 300 పత్రికలమ్మాలని కోటాయిస్తే, 420 కాపీలు అమ్మబడ్డాయి. ప్రజారక్షణదళాలకు 80 వాలంటీర్లను చేర్చారు.

పూనాలో 250 లోకయుద్ధ పత్రికలు, 500 టిక్కెట్లు అమ్మబడ్డాయి. ముస్లింలీగ్, హిందూ మహాసభ పలుకుబడిలోవున్న ప్రజలలోకూడ కామ్రేడ్స్ ప్రచారంచేశారు. షోలాపూర్‌లో 2500 సంతకాలు చేయబడ్డాయి. ముస్లింలీగ్ నాయకులు స్వయంనిర్ణయసూత్రంపై ఆధారపడిన ఐక్యతకు తమ సుముఖతను వెల్లడించారు. 300 కాపీలు 'లోకయుద్ధ' పత్రికలు అమ్మబడ్డాయి. 125 రూ. విరాళాలు వసూలయ్యాయి. కొల్హాపూరులో 200 'లోకయుద్ధ' కాపీలు, 200 టిక్కెట్లు అమ్మబడ్డాయి కొలది మంది కాంగ్రెసు సోషలిస్టులు మినహా తక్కిన కాంగ్రెసువాదులుకూడా పార్టీ పాలసీని అంగీకరించారు. ఈవిధంగా మహారాష్ట్రమంతటా ఐక్యతా ఉద్యమం జయప్రదంగా ప్రారంభమయింది.

బెంగుళూరు

జాతీయ సంక్షోభం మైసూరుస్టేటులోవున్న బెంగుళూరునుకూడ గాఢంగా అలుముకుంది. అంతవరకు కమ్యూనిస్టులకు విద్యార్థులలోగాని, కార్మికులలోగాని రాజకీయపలుకుబడి లేదు, కామ్రేడ్స్‌ను,కోలార్ బంగారుగనుల కార్మికుల మధ్య పనిజేస్తారనే భీతితో,ప్రభుత్వం,జైళ్ళలో బంధించింది. మిగిలిన కొలదిమంది పీపుల్స్ వార్' పత్రిక ద్వారా విద్యార్థులలో పార్టీ పాలసీని ప్రచారం చేస్తున్నారు.

మొదట్లో ఐక్యతా ఉద్యమాన్ని గురించి సభలుపెట్టుకోడానికి ప్రభుత్వం అనుమతి యిచ్చింది. ఊరేగింపులు ప్రదర్శనాలు నిషేధించింది. కాని తరువాత సభలుకూడా నిషేధించబడ్డాయి. ఐనా కామ్రేడ్స్ ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు 'అందరూ ఉద్యమాన్ని అభినందించారు. ముస్లింజాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించుతూ హిందువులు సంతకాలు జేశారు. ఆదివారం సాయంకాలం వేలకొలదిప్రజలు పోగయే లాల్‌బాగ్‌కు వెళ్ళి కామ్రేడ్స్ ప్రచారంచేశారు. తీసుకువెళ్ళిన సాహిత్యమంతా ఖర్చయిపోయింది. అనేక గ్రూపు మీటింగులుపెట్టి ప్రజలకు నచ్చచెప్పారు. ముస్లింలు మన పాలసీకి తమ ఆమోదాన్ని తెలిపారు. లీగ్ నాయకులుకూడా అంగీకరించారు.

విద్యార్థులు ఫాసిస్టులను ఎదిరించడానికి, సామ్రాజ్యవాదుల కుట్రను భగ్నంచేయడానికి కూడ ప్రజా ఐక్యతయే మార్గమని క్రమంగా తెలిసికొంటున్నారు.

సంయుక్త రాష్ట్రాలు

ఈ రాష్ట్రంలో తూర్పు జిల్లాలలో భయంకరమైన నిర్బంధవిధానం తాండవమాడుతూంది సాముదాయక జరిమానాలు కఠినంగా వసూలుచేయబడుతున్నాయి. చెల్లించలేకపోతే సామాను, తలుపులు వగైరా, వేలం వేయబడుతున్నాయి. అగష్టు 8 కి పూర్వం గ్రామాలలో ఏయింట్లో ప్రవేశించడానికైనా పోలీసులకు గుండెవుండేదికాదు. ఇపుడది

ఐక్యతా ఉద్యమం

నిత్యం జరుగుతున్న విషయం. విధ్వంసక చర్యల ఫలితమిదే.

ఇలాంటి క్లిష్టపరిస్థితులలో ఛాందోసీ ఫిర్కాలో (బెనారెస్ జిల్లా) గ్రామమైన ఫెరూనాఉదాహరణ అందరికి ఆత్మవిశ్వాసాన్ని కల్గించితీరుతుంది. ఫెరూనా గ్రామం జనసంఖ్య 2 వేలు. సెయ్యద్ రైజా రైల్వేస్టేషనుకు రెండుమైళ్లదూరంలో వుంటుంది. రైజా గ్రామంలో ప్రజలు ఉద్రేకులైరి స్టేషన్‌పైకి వెళ్లారు. కాల్పులు జరిగాయి. కాని ఫెరూనా గ్రామం శాంతంగావుంది. ఆప్రాంతంలోకల్లా యీ గ్రామం రాజకీయంగా పేరుబడ్డది. ఆ ఫిర్కాలో యీ గ్రామం కాంగ్రెసు ఉద్యమానికి ఆటపట్టు. 1930, 32 ఉద్యమాలలో చాలమంది జైలుకు వెళ్లారు. స్థానిక అధికారులు యిచట అల్లరి జరుగుతుందని, కక్ష తీర్చుకుందామని వేచికూర్చున్నారు. కాని ఫెరూనా శాంతంగానే వుండిపోయింది.

బెనారస్ విశ్వవిద్యాలయ విద్యార్థుల దళం యీ ప్రాంతంలో ప్రచారంచేశారు. విధ్వంసక చర్యలు స్వాతంత్ర్యానికి మార్గం కాదనీ, జాతీయైక్యత ఒక్కటే జపానునెదిరించడానికి, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించడానికి మార్గమని నచ్చచెప్పారు. వారు 40 గ్రామాలు వెళ్లారు కొన్నిచోట్ల ప్రజలు తమ అవస్థ తామే పడతామనీ, మీరు వెళ్లిపొండనీ ప్రచారకులను కోరారు. ఫెరూనా గ్రామం మాత్రం వారిని హృదయపూర్వకంగా ఆహ్వానించింది. ఇంతేగాదు, గ్రామస్థులందరి సహకారంతో ప్రజారక్షణ సంఘం ఏర్పరచబడింది. వాలంటీర్లు రాత్రిళ్లు గ్రామాన్ని కాపలా కాసేవారు. ఐకమత్యంగా వుండాలనీ, విధ్వంసక చర్యలు ప్రజలకే అరిష్టదాయకమనీ, బోధించారు దీని ఫలితంగా చుట్టూ గ్రామాలలోఅల్లరులు జరిగినా యీ గ్రామం శాంతంగావుంది.

ఫిర్కాలో అన్నిగ్రామాలపైన జరిమానా విధించబడింది. ప్రతి గ్రామము భూమిశిస్తుకో ఐదవ వంతు జరిమానా చెల్లించునట్లు నిర్బంధించబడింది. పోలీసులు జరిమానాల వసూలుకు రాగానే రైతులు పొలాలకు పారిపోయి దాగుకొనేవారు. ఆ ఫిర్కాలో ప్రజలంత భీతిచెందారు. పోలీసులు తమ చేతికందిన దల్లా తీసికెళ్ళి జరిమానా వసూలుచేశారు. సంపూర్ణ ఐకమత్యంతోవున్న ఫెరూనాగ్రామంమాత్రం ధైర్యంగా నిలబడింది.

గ్రామస్థులంతా జరిమానా రద్దుచేయాలనే నినాదంపై సంఘటితమయ్యారు. ప్రభుత్వానికి ప్రజలందరిసంతకాలతో పిటీషను పంపబడింది. మునసబునుకూడా ఒత్తిడిచేసి, ఈ గ్రామానికి విధ్వంసక చర్యలతో ఎట్టి సంబంధంలేదని వ్రాయించారు ముస్లింలీగుకు జెందిన స్థానిక జమీందారుకూడా దీన్ని బలపరిచాడు. ఫలితంగా సాముదాయక జరిమానా రద్దుచేయబడింది. ఈ ఆర్డరును అమలుచేస్తూన్న ఉద్యోగస్తుడు, ఇంత ప్రాముఖ్యంగల కాంగ్రెసు గ్రామానికి జరిమానా రద్దవడం విచిత్రమేనని విస్తుపోయాడు. ఆ నిరంకుశాధికారి కేమి తెలుసు, ప్రజాఐకమత్యంలో ఎంత బలమున్నదీ!

భారతదేశంలోని ప్రతిగ్రామం ఫెరూనా అడుగుజాడల ననుసరించాలి. అప్పుడు మనం సాముదాయక జరిమానాలను రద్దుచేయించుకోగల్గుతాము; జాతీయ ప్రభుత్వం సంపాదించి, జపాన్ దుండగీడుల నహ మార్చగల్గుతాము.

పంజాబు

కమ్యూనిస్టు పాలసీ ఒక్కటే ప్రజాహక్కులను రక్షించే దేశభక్తియుతమైన పాలసీ. కమ్యూనిస్టులు ఎచటవున్నా ప్రజాహక్కుల కొరకు నిలబడి పోరాడుతారు. పంజాబు అసెంబ్లీలో ముగ్గురు కమ్యూనిస్టు సభ్యులున్నారు పంజాబు కమిటీ కార్యదర్శి సోహన్‌సింగ్‌జోష్, తేజ్‌సింగ్ స్వతంత్ర, బీబీ రఘబీర్‌కార్.

అసెంబ్లీ అక్టోబరు సమావేశానికి మన కామ్రేడ్స్ హాజరుకావాలని పార్టీకమిటీ నిర్ణయించింది. మిగతా దేశభక్తులు వీరు మితవాద పంథా అవలంభించుతున్నారని హేళన చేస్తారని వీరికి తెలుసు. కాని దేశంలో నిర్బంధ జ్వాలలు వ్యాపించినప్పుడు, ప్రజలు నాయకత్వంలేక, తరుణోపాయం తెలియక, విధ్వంసకవిధానం అవలంభించుతున్నప్పుడు, అసెంబ్లీకి హాజరయి, ప్రజాహక్కులను కాపాడుతూ అధికారుల నిరంకుశత్వాన్ని బట్టబయలు చేయడం అసెంబ్లీ కామ్రేడ్స్ కర్తవ్యమనుకున్నారు. జైళ్ళ బయటవున్న కొలదిమంది కాంగ్రెసు అసెంబ్లీ సభ్యులు హాజరుకాలేదు. అందుచే అసెంబ్లీలో మన కామ్రేడ్స్ ఒక్కరే కాంగ్రెసును, జాతీయోద్యమ సాంప్రదాయాలను, ప్రజాహక్కులను రక్షించడానికి మిగిలారు. సర్‌సికందర్ ముఠాతో నిలబడి పోరాడవలసివచ్చింది. ఒకటి చెబుతూ మరొకటి ఆచరించుతున్న ప్రభుత్వ పాలసీని బట్టబయలు చేశారు.

వీరి ఆద్వర్యమెంటు తీర్మానాలకు అవసరమైనంతమంది సపోర్టులేకపోవుటచే వీగిపోయాయి. కాని ముస్లింలీగ్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాలిక్‌బర్కత్‌ఆలీ, కాంగ్రెసువారికి జైళ్ళలో తగిన సౌకర్యాలివ్వాలనే తీర్మానాన్ని బలపరచాడు. కామ్రేడ్స్ అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక, మంత్రులు, వారి కార్యదర్శులు ఎల్లప్పుడూ "పబ్లిక్‌క్షేమం దృష్టితో ఈ ప్రశ్నకు సమాధానమివ్వడం వీలుకాని" ఒక చిలుకపల్కు వల్లించేవారు. ఆజానుబాహుడు, గడ్డాంతాత అయిన కామ్రేడ్ సోహన్‌సింగ్‌జోష్, "ఐతే మీరు సమాధానం చెప్పగలదేదో చెప్పండి?" అని ఈసడించాడు. కాని దానికి సమాధానం రాలేదు.

ప్రభుత్వతీర్మానాలపై చర్చలలోపాల్గొంటూ కామ్రేడ్ జోష్ ప్రజాభిప్రాయాన్ని విశదీకరించాడు. ఫాసిస్టు దురాక్రమణదారులను ఎదిరించడానికి భారతప్రజ లందరిని సమీకరించ గలిగిన ప్రజానాయకులను ప్రభుత్వం అరెస్టు చేసిందని నిరసించాడు. సికందర్‌వైపు తిరిగి, "మీరు దేశభక్తులను అరెస్టుజేసి, జైళ్ళలో సరిగాచూడటంలేదు. నిజమైన పంచమాంగదళాన్ని మీరు అరెస్టుచేయడంలేదు. ఫాసిజాన్ని ఓడించడానికి ఒకేమార్గముంది." అని గర్జించాడు. అసెంబ్లీ సోఫాలలో కునికిపాట్లు పడుతున్న పెద్దమనుష్యులు వులిక్కిపడిలేచి వినసాగారు. కామ్రేడ్ జోష్, ప్రభుత్వం కాంగ్రెసునాయకులను విడుదల చేయాలనీ, కాంగ్రెసు-లీగ్ ఐక్యతపై ఆధారపడిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలని, అదొకటే స్వాతంత్ర్యానికి మార్గమనీ వివరించాడు.

స్వాతంత్ర్యయోధులు-కుక్షింభరులుకాదు

సర్ సికందర్ గారి యూనియనిస్టుపార్టీ కేంద్ర ప్రభుత్వ ఆదాయంలోనుంచి యుద్ధానంతరం సైనికులకు బహుమతులివ్వాలనే తీర్మానం ప్రతిపాదించింది. కామ్రేడ్ తేజసింగ్‌స్వతంత్ర మాట్లాడుతూ, "జాతుల స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్నప్పుడు కుక్షింభరులు ఆర్టే ఉపయోగపడరు. ప్రజలు యుద్ధం తమదనుకోడానికి, తమ స్వాతంత్ర్యం కోసం జరుగుతోందని ఉత్సాహితులవడానికి జాతీయ ప్రభుత్వం కావాలి. మీరు ప్రాత పద్ధతులు అవలంభించి, అసలు సమస్యను వదలివేస్తున్నారు సైనికులు లెక్కువగా చేరడానికి ఉపాయం జాతీయ ప్రభుత్వం. మన సైనికులకు ఏబహుమతీ సరిపోదు; వారి మాతృదేశానికి స్వాతంత్ర్యమే అన్నిటినీ మించిన అర్హమైన బహుమానం; అదే విజయానికి మార్గం" అన్నాడు.

నిర్బంధ కాపలా

పంజాబు ప్రభుత్వం రైతులను తమప్రాంతంలో వున్న రైల్వే లైనును కాపాడమని నిర్బంధించుతూంది. మన కామ్రేడ్స్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మంత్రులు పునరాలోచించుతామని చెప్పవలసి వచ్చింది. నిర్బంధంగా చందా వసూళ్లుచేయరాదని ఉద్యోగులకు ఉత్తరువు చేస్తామని ఒప్పుకున్నారు.

కాంగ్రెసు పత్రికలు పై విషయాలను ప్రకటించడంలేదు. కాని నిజం దాగదుగా! ప్రజలు పార్టీఆపీసుకు తండోపతండాలుగా పిటీషన్లు పంపుతున్నారు. తమ కోర్కెలు, ఇబ్బందులు ప్రభుత్వానికి తెలుపాలని కామ్రేడ్సును కోరుతున్నారు. "మాగోడు ఆలోచించేవారు, మాతరవున మాట్లాడేవారు మీ రొకరే మిగిలారు" అని ప్రజలంటున్నారు. బయట ప్రజలలో మనం సాగించే ఐక్యతా ఉద్యమానికి, అసెంబ్లీలో మన పార్లమెంటరీ కార్యక్రమం తోడుచేస్తే,ప్రజలనుఉత్తేజపరచడానికి, వినియోగ పడుతుంది. ఓర్పుతో, కృతనిశ్చయంతో పనిచేస్తే పపం జయించితీరుతాము.

★ నూతన రాజకీయ చైతన్యం — — ఐక్యతా ఉద్యమ ఫలితం

ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులలో ఐక్యతయే పోరాటం - ఇదీ కమ్యూనిస్టు పార్టీ నేటి నినాదం. సర్వతోముఖమైన జాతీయైక్యతలేనిదే పార్టీలన్నీ కోరే దేశరక్షణగాని, దేశ స్వాతంత్ర్య సంపాదనగాని కొనసాగనేరవు. ఏ దేశచరిత్ర చూచినా, అచ్చటి పాలకవర్గం చీలదీసి పరిపాలించటం (Devide and rule) వల్లనే ప్రజలను అణచివుంచ గలుగుతున్నారు. సర్వ సామాన్యమైన యీ రాజనీతి ప్రస్తుత పరిస్థితులలో సామ్రాజ్యవాదానికి మరింత అవుసరమైనది. అందుచేతనే కాంగ్రెసు - లీగు ఐక్యతకు ప్రభుత్వం అనేక ఆటంకాలను కల్గిస్తూవుంది.

ఈ చీలదీసి పరిపాలించే విధానాన్ని, సోదరుడూ సోదరుడూ భుజాలు కలిపి నిల్చేబదులు కర్రలు చేతబుచ్చుకొని యెదురెదురుగా నిల్చొనునటు జేసే విధానాన్ని, భగ్నం చేయటానికే కమ్యూనిస్టుపార్టీ ఐక్యతా వుద్యమాన్ని ప్రారంభించింది. దేశ రక్షణలను భగ్నపర్చనట్టిదిగాక, దేశ రక్షణలను, జాతీయ స్వాతంత్ర్య సంపాదన ప్రయత్నాలను బలపర్చేదిగా యీ ఐక్యతావుద్యమం ప్రారంభింపబడినది. ఈ వుద్యమంలో మొదటిమెట్టు సంతకాలు.

మహజర్లు ఏమిటి?

మితవాదులూ మహజర్లు పెట్టించారు, కమ్యూనిస్టులూ పెట్టిస్తున్నారు. వాళ్ళకీ, వీళ్ళకీ తేడా యేమిటి? అని ఆక్షేపించినవారు లేకపోలేదు. ప్రస్తుతం కాంగ్రెసు పేరిట జరిగే పోరాటాన్ని అభిమానించేవారందరూ, సర్వసాధారణంగా, యీ విధంగా ఆక్షేపించినవారే. కాని క్రిమేణ వారేఈరూపసాదృశ్యంలో తత్వభేదాన్ని గుర్తిస్తున్నారు. మితవాదులు సామ్రాజ్యవాదుల దయాధర్మ భిక్షలపై, హృదయ పరివర్తనపై ఆధారపడుతారు; మహజర్ల ద్వారా అవి చేయమనీ, ఇవి చేయమనీ ప్రార్థేయపడతారు. ఈ పద్ధతిద్వారా కట్లుతెగి ప్రవహించబోయే ప్రజావుద్రేకానికి బంధాలువేయజూస్తారు. ఇదీ మితవాదుల మహజర్లతత్వం. కమ్యూనిస్టులు విన్నవించేది సామ్రాజ్యవాదులకు కాదు. ప్రజా బాహుళ్యానికి. మీరు యీ తప్పు జేశారు, ఆ తప్పుజేశారని ప్రభుత్వానికి వేలెత్తి చూపించటం కాదు కమ్యూనిస్టుపార్టీ పని. జాతీయ నాయకులను విడుదలజేసేటట్లు, జాతీయ ప్రభుత్వాన్ని యేర్పరచేటట్లు ప్రభుత్వాన్ని లొంగదీస్తానికై ప్రజ ఏమిచేయాలో చెప్పి, వారు ఆ పంథాను నడచునట్లు చేయడమే కమ్యూనిస్టుపార్టీ పని. జాతీయైక్యతా వుద్యమం యేవిధంగా సాగుతోందో చూస్తే యీ విషయం స్పష్టంగానే కన్పిస్తుంది.

పసిబాలలకు కూడా స్పష్టమే

రేపల్లెతాలూకా (గుంటూరు జిల్లా)లో కామ్రేడ్సు అనేక గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం జేశారు. ముఖ్యంగా బీదరైతులు, వ్యవసాయ కూలీలలో ప్రచారం సాగింది. మొత్తంమీద దాదాపు 3000 సంతకాలు పెట్టించారు. 1200 మంది దగ్గర రు 450/-లు (అర్థణాలు కాక) పార్టీఫండు వసూలు చేశారు. ఇదికాక 420 ఏట్లజండాలు ఎంతో ఆదరాభిమానాలతో కొన్నారు. ప్రజలు, పెద్దవరం గ్రామంలో ఈ ప్రచారంవల్ల ఆకర్షింపబడ్డ ఒక బిచ్చగాడు సహితం జోలిలోనుండి ఒక కానీతీసి పార్టీఫండుక్రింద యిచ్చాడు. ఒక యువకుడు తన సర్వస్వమైన సైకిలును విరాళంక్రింద యిచ్చాడు కనగాలలో ఒక కామ్రేడ్ యొక్క 7 సంవత్సరాల ముద్దుకూతురు కామ్రేడ్సుయొక్క ప్రచారం, ఫండు, వసూలు చేయటం జూచి, తన వెండికంచాన్ని పార్టీ ఫండుకు యిచ్చింది; పైగా 5 పొరుగిళ్ళకు వెళ్ళి, చందాలడిగి 5 కానులను తెచ్చి పార్టీఫండు కిచ్చింది. మరొక చిన్నబాలిక తనకాలి పట్టాలను ఇచ్చింది.

చైనా రష్యాల సాదృశ్యం

మహా బలసంపన్నమైన రాజ్యాలని తలచబడ్డ ఫ్రాన్సు, పోలెండు, జకొస్లొవేకియా మొదలగురాజ్యాలు కనురెప్పపాటుకాలంలో ఫాసిస్టులకు దాసోహం అనటం ఎందుచేత? రష్యా చైనాలుఎందువల్ల ఫాసిస్టు సేనల్ని భస్మీపటలం చేస్తున్నాయి. ఫ్రాన్సు మొదలగు దేశాలన్నిటిలో సామ్రాజ్యవాదులు చేసిన కుట్రల ఫలితంగా ప్రజలచే ఏర్పడ్డ పాప్యులర్ ఫ్రంటు నాశనమైంది; ప్రజలలో ఛీలికలు వృద్ధియైనాయి; ఫాసిస్టులపనిసానుకూలపడ్డది; చివరకుజర్మను దాడిప్రారంభంకాగా నేపిటాన్,డార్లాన్,వేగాన్, మొదలగు ప్రజాద్రోహులు తమ దేశాన్ని హిట్లరుకు అమ్మివేశారు. తత్ఫలితంగా తాత్కాలికంగా,ప్రజావిప్లవాన్ని భగ్నంచేశారు. కానిసోవియటు యూనియనులో, చైనాలో సంపూర్ణమైన జాతీయైక్యత ఏర్పడ్డది. శత్రువును ప్రతిఘటిస్తానికి, దేశరక్షణలను బలపరచటానికి సర్వతోముఖమైన జాతీయైక్యత సిద్ధించింది. అందుచేతనే మంచూరియా, జెహోల్ రాష్ట్రాలను కోల్పోయినచైనా 1936లో కమ్యూనిస్టుపార్టీతో గావించుకొన్న ఒడంబడికవల్ల 5 సంవత్సరంల నుండిఅకుంఠిత పరాక్రమంతో శత్రువు నెదిర్చి పోరాడుతున్నది. జాతీయైక్యతయొక్క శక్తి, అవుసరం దీనివల్ల గుర్తించవచ్చు. ఇవి తుళ్ళూరులో కోయవేషగాళ్ళు చెప్పిన సుద్దులు. ఈ వేషధారులే సంతకాలుపెట్టించి, పార్టీ ఫండుకు, మిడ్నపూరు తుపాను బాధితుల సహాయానికి డబ్బును, బట్టలను వసూలుచేశారు.

రెంటపాళ్ళలో 16 తేదీన జరిగిన బహిరంగ సభకు 500 మందికి పైగా ప్రజలుహాజరైనారు. జపాను దండయాత్రనుండి మాతృదేశాన్ని సంరక్షించుకుంటానికి కాంగ్రెసు - లీగు ఐక్యతపై ఆధారపడిన జాతీయైక్యత యెంత అవుసరమో ఉపన్యాసకులు విశదపర్చారు. కామ్రేడ్ నాశం బసవమ్మగారు జపాన్ కిరాతకుల అమానుష కృత్యాలనుండి స్త్రీలు ఆత్మరక్షణ గావించుకోవలసిన అవుసరాన్నిగూర్చి తెలియజేశారు. ఒక ప్రచారకదళం అచ్చంపేట, బెల్లంకొండ,ఫిర్కాలలో తిరుగుతూ బహిరంగ సభలలో ఐక్యతావుసరాన్ని గూర్చి ఉపన్యసిస్తున్నారు. వీరికి సహాయంగా రామకోటి బుర్రకథ పెట్టి, జర్మనీ రష్యా యుద్ధంగూర్చి, సోవియట్ లోని జాతీయైక్యతను గూర్చి కథలు చెప్పుతున్నారు. స్త్రీ కామ్రేడ్సు కూడా ప్రచారంలో పాల్గొని స్త్రీలకు ఆత్మరక్షణాన్ని గూర్చి తెలియ జేస్తున్నారు 3 గ్రామాలలోనే 26-2-0 లు మరికొంత జొన్నలు, సజ్జలు, కొర్రలు, వేరుశనగకాయలు, కూడా పార్టీ ఫండు క్రింద వసూలు ఆయాయి.

దేశభక్తి, ద్వేషాన్ని జయించింది

మారుటేరు(ప. గో. జిల్లా)లో ఒక కాంగ్రెసువాది కమ్యూనిస్టులను ప్రభుత్వ ఏజంట్లనీ, విప్లవద్రోహులనీ తిడుతూవుండేవాడు. మన కామ్రేడ్స్ ఐక్యతావుద్యమ ప్రచారంలో వారిని కలుసుకుని విజ్ఞప్తిని చదివి వివరించారు. చాలాసేపు వాగ్వివాదం జరిగింది చివరకు కమ్యూనిస్టులను తిట్టుటతప్పుఅనీ, వారుచెప్పే పంథా సరియైనదనీ ఒప్పుకున్నాడు. ఈ గ్రామంలోనే ప్రస్తుత 'పోరాటాన్ని' బలపరుస్తూ, మన పంథాను నిరసిస్తూవుండే యువకులు కొంతమంది, మన కామ్రేడ్స్‌తో చర్చించిన పిమ్మట పూర్తిగా మన పాలసీని అంగీకరించారు. అందరూ హృదయ పూర్వకంగా విజ్ఞప్తులపై సంతకాలు జేశారు. తాత్కాలికంగాదూరమైనా, దేశభక్తులు తిరిగి మాపంథాకే వస్తారనే మా విశ్వాసం ధృవపడ్డది.

పశ్చిమగోదావరిలోనే కాదు, గుంటూరు జిల్లా పర్చూరులో కూడా అరాజకమే స్వాతంత్ర్యమని వాదించి, అందుకై ప్రయత్నించిన ఒకరు పార్టీపంథాను విన్నమీదట పూర్తిగా మారిపోయాడు. పార్టీపంథామే నేడు దేశాన్ని శత్రుభయమునుండి రక్షించగలదనీ, స్వాతంత్ర్య సంపాదనకు తోడ్పడగలదనీ అంగీకరించి కొద్దిమొత్తాన్నికూడా చందాయిచ్చాడు. ఈ గ్రామంలోనే ఒక తపాలాబంట్రోతు, మహమ్మదీయకంపౌండరు కూడా పార్టీఫండుకు విరాళాలిచ్చారు, సగర్వంగా.

చింతలపూడి(ప గో జిల్లా)లో కామ్రేడ్స్ అనేకవందల యిండ్లకుపోయి ఐక్యతా నినాదాన్ని అందజేశారు; సంతకాలు చేయించారు. చుట్టుప్రక్కల గ్రామాలలోకూడా తిరిగి ప్రచారంజేశారు. ఒకగ్రామంలో 12మంది కాంగ్రెసువాదులను కలుసుకున్నారు. వీరంతా మొదట పార్టీని బ్రిటిషుప్రభుత్వానికి దాస్యం చేస్తున్నదని నిందించారు. వీరి ఆరోపణలివి:- మీరు యుద్ధానికి సహాయం చేయాలంటారు, మనకూ లీగుకూ ఐక్యత కుదరదు; బ్రిటిషు సామ్రాజ్యవాదులను తరిమిన పిమ్మట జపానును ఎదుర్కోవచ్చునుగా. కామ్రేడ్సు శాంతంగా, ఓర్పుతో 3 గంటలసేపు వాదించారు. భారతదేశం నేడు శత్రువునుండి తన్నుతాను రక్షించుకోవాలంటే, ప్రపంచ ప్రజలందరూ కలిసి పోరాడే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలనియ్యూ, ఆ విధంగా పాల్గొనుట ద్వారానే యుద్ధయత్నాలను ప్రజాధికారంక్రిందకు తీసుకురాగల్గుతామనియు; అట్లు పాల్గొనుటకు ముందు కాంగ్రెసు-లీగు ఐక్యత ఏర్పడాలనియు; ఇట్లు జాతీయ రక్షణకై జాతీయప్రభుత్వ స్థాపనకై సర్వతోముఖమైన ఐక్యతను సాధించినప్పుడే, సామ్రాజ్యవాదుల చేతులలోవున్న ఆయుధం ఒక్కదానినీ భగ్నం చేసినప్పుడే, ప్రభుత్వాన్ని లొంగదీయగలమనీ, వివరించిచెప్పారు. చివరకు వారు మన నినాదాలను అంగీకరించి పార్టీ ఫండుకు కొద్దికొద్దిగా (మిగతా 9 వ పేజీలో)

కామ్రేడ్ నండూరి ప్రసాదరావు

• విజ్ఞప్తి •

సోదర దేశభక్తులారా —

మనమందరము ప్రస్తుత ప్రపంచ సంఘటనలను సమగ్రంగా అర్థంచేసుకొనక కాంగ్రెసుపేరిట దేశస్వాతంత్ర్య నిరోధకమైన పనులు (రైల్వేబద్దెలు తీసివేయుట, రైల్వేతీగలు టెలిగ్రాముతీగలు త్రెంచుట, ఇళ్లు తగలబెట్టుట మొదలయినపనులు) చేస్తూవున్నాము. ఇది పరోక్షంగా జపాను ఫాసిజాన్ని ఆహ్వానించడ మన్నమాటే.

దేశస్వాతంత్ర్యానికి మార్గం ఈ కార్యక్రమమే అని నేటి వరకు నేను భ్రమపడ్డాను. కాని, ఈరోజున తూర్పుగోదావరి జిల్లా కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరుతో జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను గురించి సమగ్రంగా చర్చించిన మీదట, నాభావములను పూర్తిగా మార్చుకొనక తప్పినదికాదు. ఈ రోజున భారత కమ్యూనిస్టుపార్టీ ఇచ్చిన కార్యక్రమము ద్వారానే స్వతంత్రం లభించగలదని, జాతీయ ఐక్యతకు, జాతీయ స్వాతంత్ర్యానికి ఈ కార్యక్రమ మొక్కటే మార్గమని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను.

నేటివరకు సాగుతూన్న స్వాతంత్ర్య నిరోధక కార్యక్రమాన్ని ఇంకా తీవ్రతరంచేయవలసినదిగా దేశ ద్రోహులైన ఫార్వర్డు బ్లాకు సభ్యులు హెచ్చరిస్తున్నారు. అమాయక ప్రజానీకంలో ప్రచారంచేస్తున్నారు. ఈ వినాశకరకార్యక్రమాన్ని అరికట్టడం నిజమైన దేశభక్తుల విధి. లేకపోతే దేశ వినాశము తప్పదు- శాశ్వత బానిసత్వానికి మనం తలవొగ్గవలసి వుంటుంది.

కాబట్టి దేశభక్తులు ఈ విధ్వంసక కార్యక్రమాన్ని విడనాడి, దేశరక్షణకు కమ్యూనిస్టుపార్టీ యిచ్చిన ఐక్యతా కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా నాప్రార్థన.

ఇట్లు,
గోరుగంతుల బ్రహ్మానందరావు
(తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యుడు)

సంఘటిత శక్తికి విజయం

'క్రే' విమానాశ్రయానికి నిత్యము రైతులుకట్టేబండ్లకు రేటు 2 నెలలక్రితం 100కి 25 చొప్పున తగ్గించబడింది. ఈవిధంగా రోజుకు 1000 బండ్ల చొప్పున 4 రోజులు చేశారు. స్థానిక పార్టీ కార్యదర్శి (తాలూకా) వెంటనే రైతులందరినీ జిల్లాకలెక్టరు యెదుట సమావేశపరుస్తానని కంపెనీ ఏజంటుకు తెలియజేశాడు. రైతులకు రావలసిన సొమ్ము వారి కిచ్చివేస్తే తమకు పరాజయం కలుగుతుందేమో నని, మొదట నిరాకరించారు. కాని, రైతుల సంఘటిత శక్తిని కొద్ది రోజుల్లోనే తెలుసుకొని, వారి కీయవలసిన రు 4,000 లు పూర్తిగా యిచ్చివేశారు. చివరకు కంపెనీ ఏజంటుకు పాపం పరాజయం తప్పిందికాదు. విజయం రైతుల సంఘటితశక్తికే లభించింది.

ఇదేవిధంగా, కొందరు రైతులపై డిప్యూటీ కలెక్టరు కేసులు పెట్టాలని యెంతో ప్రయత్నించాడు. కాని, స్థానిక కామ్రేడ్స్ జిల్లాకలెక్టరుతో అనేకసార్లు చర్చించి, ఉన్నకేసులు ఉపసంహరించుకొనేటట్లు చేశారు. కొత్త కేసులు రాకుండా చూశారు.

కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీసంఘ కృషి

పై సంఘంలో 5000 మంది సభ్యులు, 150 ప్రాథమిక సంఘాలు ఉన్నాయి. ఈ సంవత్సరం (1942)లో జిల్లా మొత్తంమీద 1250 యకరముల బంజరుభూమి కూలీలకు యిచ్చునట్లు జిల్లాసంఘం కృషిచేసింది దీనివల్ల 2000 మంది కూలీలకు కొంత ఉపాధి యేర్పడింది. కాని ఈ ఆహార అధికోత్పత్తికి చల్లపల్లి జమీందారు, పెదముత్తేవి షావుకార్లు, కొర్నిపాడు అగ్రహారీకులు, నెప్పల్లి షావుకార్లు, తీవ్రమైన ఆటంకాలు కల్పించి, కూలీలను అనేక కష్టాలకు గురిచేస్తున్నారు.

దివి తాలూకా నాగాయతిప్ప, విశ్వనాథపల్లి, కొత్తపాలెం వగైరా గ్రామాలలోను, గుడివాడ తాలూకా కుదరవల్లి, వెన్ననపూడి, కొర్నిపాడు, జొన్నపూడి వగైరా గ్రామాలలోను, సమిష్టివ్యవసాయ క్షేత్రాలు నిర్మించబడి పని చేస్తున్నాయి. గన్నవరంతాలూకాలో 8 గ్రామాలకు నూతులుకావాలని లేబర్‌డిపార్టుమెంటుపై ఒత్తిడితేగా, 3 గ్రామాలకు మంజూరుచేయబడ్డాయి చౌకధరల డిపోలకై జిల్లామొత్తం మీద ప్రభుత్వాధికారులకు అనేక అర్జీలు పంపబడ్డాయి. కాని ఫలితం కనపడలేదు. కాబట్టి వీరు తమ సంఘటితశక్తిని వృద్ధిచేసుకోవలసియుంది. వ్యవసాయ కూలీలు విరివిగా తమ సంఘంలో సభ్యులై, ప్రజాబలంతో నిరంకుశాధికారుల్ని లొంగదీయవలసియుంది.

రైతు - కూలీల ఐక్యత

తెనాలి తాలూకా కఠెవరం గ్రామంలో వ్యవసాయ కూలీలు అధికధరలకు తాళలేక, కూలి పెంచవలసిందని రైతుల్ని కోరారు. మొదట రైతులు నిరాకరించారు కాని, జిల్లా వ్యవసాయకూలీసంఘ. అధ్యక్ష, కార్యదర్శులు గావించిన కృషిఫలితంగా రైతు-కూలీల మధ్య ఐక్యతఏర్పడింది. అదనంగా ఒకమానెడుగింజలు కూలీలుకోరితే, రైతులు తవ్వెడు యిస్తామన్నారు. కూలీలుకూడా అందుకంగీకరించారు.

డిపాజిట్ చేసినా, స్టోర్సు లేవు

జీవితావసరాలధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్య ప్రజల సౌకర్యార్థం కో-ఆపరేటివ్ స్టోర్సును స్థాపిస్తాంఅని ప్రభుత్వం ప్రకటించింది. కాని, బెజవాడ తాలూకాలో కొన్ని గ్రామాలు పిటీషన్లు పంపి, డబ్బు డిపాజిట్ చేసినప్పటికీ, ఇంతవరకూ స్టోర్సు స్థాపించలేదు. తాలూకా మెట్ట ప్రాంతాలలో అడవులు రైతుల హక్కుఅగుననే మిషతో బినామీ పట్టాలిచ్చుట, కట్టెలమ్ముట, మొదలైన చట్టవ్యతిరేక చర్యలు సాగుతున్నాయి. ఉదాహరణకు దుగిరాలపాడు అడవి. ప్రభుత్వం యిట్టి అక్రమాలను అరికట్టవలసిందని కోరుతూ బెజవాడ తాలూకారైతుసంఘం తీర్మానించింది.

రాష్ట్ర రైతుసంఘ చర్యపట్ల అసమ్మతి

ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం అఖిల భారత రైతు సంఘంనుండి విడిపోయినట్లు తీర్మానించడం ఆంధ్ర రైతాంగానికి అపచారం చేయడమవుతుంది కాబట్టి, వారి నిర్ణయంపట్ల అసమ్మతిని ప్రకటిస్తూ, బెజవాడ తా॥ రైతు సంఘం, పుంగనూరు తాలూకా రైతుసంఘం, గన్నవరం తాలూకారైతుసంఘం తీర్మానాలు గావించాయి. గుడివాడ తాలూకా రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకటన గావించారు.

సాముదాయక జరిమానాలు రద్దు కావాలి

నందిగామతాలూకా రైతుసంఘ కార్యనిర్వాహక వర్గం 1-12-42 న సమావేశమై వేల కొలది అమాయక రైతులపై విధించబడ్డ సాముదాయక జరిమానాలు రద్దు చేయవలసిందనీ, మునియేరు ప్రాజెక్టుక్రింది భూములన్నిటినీ ఆయకట్టులో చేర్చవలసిందనీ, ప్రస్తుతం ఆ ప్రాజెక్టుక్రింద సాగు అయ్యే భూములకు అధికారులు తగినంత నీటి సప్లయి చేయవలసిందనీ కోరుతూ తీర్మానించింది.

జీవితావసర వస్తువు లన్నింటికీ కంట్రోలు అవసరం

ప్రభుత్వం పంచదార ధరను కంట్రోలుచేసి, ధాన్యాదులను కంట్రోలు చేయకపోవడం వల్ల ధాన్యాదులపై వచ్చే ఆదాయం చెరకుపంటపై రాక, రైతులు చెరకుపంట మానివేస్తారు. ఆవిధంగా పంచదార సప్లయిలో కొరత యేర్పడుతుంది. కాబట్టి, జీవితావసరమైన వస్తువులన్నింటికీ ఒక క్రమపద్ధతిప్రకారం కంట్రోలు పెట్టవలసిందని కోరుతూ గన్నవరం తాలూకా రైతుసంఘం తీర్మానించింది. సాముదాయిక జరిమానాలు రద్దుచేయవలసిందని ప్రభుత్వాన్ని కోరింది.

దౌర్జన్యాలు

ఏలూరు తాలూకాలో అలుగులగూడెం అనే గ్రామంలో కామ్రేడ్ నందూరి లక్ష్మయ్య వ్యవసాయ కూలీరంగంలో పనిచేస్తున్నాడు. మన కామ్రేడ్ కృషి ఫలించింది. వ్యవసాయ కూలీలకు న్యాయమగు రేటు లభించింది. కాని ఆ ప్రాంతంలోని కొడవలి సీతయ్యకు ఇదంతా మహా కంటకమనిపించింది. లక్ష్మయ్య మీద కసితీర్చుకోవాలనుకొన్నాడు. అతని కుటుంబంలోని వారిని కొంతమందిచేత మన కామ్రేడ్‌ను చావబాదించాడు. కామ్రేడ్ ఏలూరు హాస్పిటలులో చికిత్స పొందుచున్నాడు.

విశాఖపట్నంలో

విశాఖపట్టం హార్బరు అండ్ పోర్టువర్కర్ల యూనియన్ కార్యనిర్వాహకవర్గ సభ్యులలో కామ్రేడ్ రాములు ఒకరు. ఇతను కార్యదీక్ష, చైతన్యంగల వర్కరు. అక్కడ పదవీభ్రష్టుడైన బుద్ధిరాజు మల్లికార్జునరావు అనే ప్లీడరు మొదటినుంచి కమ్యూనిస్టులంటే కారాలు మిరియాలు నూరే మహానుభావుడు. కమ్యూనిస్టుల మీద అసహ్యమైన ప్రచారాలుచేసి, కార్మికుల మనసు విరచడానికి ఎంతైనా ప్రయత్నించాడు. కమ్యూనిస్టులంటే ఎవరో తెలుసుకున్న కార్మికులు అతని వలలో పడతారా ! ఈ ఎత్తుసాగకపోవడంతో పీడరుగారు ఏమిపన్నాగంపన్నారో, ఒకరోజు సాయంకాలం హార్బరులో ప్లీడరుగారి ఏజెంటు కామ్రేడ్ రాములను కొట్టించడం కూడా జరిగింది. ఈ గుండాచర్యను కార్మికులు అసహ్యించుకొంటున్నారు.

కరువు - కంటకాలు

గురువులరాక, అల్లుని అలక, భార్య జబ్బు, అప్పిచ్చిన వాడి అడావుడి - ఇలాంటి వన్నీ ఒక దౌర్భాగ్యుని మీద ఒకేసారి విజృంభిస్తే ఇకవాడిస్థితి ఎలావుంటుందో వూహించుకోమన్నాడు ఒకకవి. మనరాష్ట్రంలోనిసామాన్య ప్రజలస్థితి కూడా ఈ నాడు ఇలాగేవుంది. ఒకవైపు నిత్య జీవితానికి అత్యవసరమైన సరకులకు కరువు వచ్చింది. మరొకవైపు సరకుల ధరలు పెరిగిపోయాయి. ఇంకొకవైపు నిరంకుశాధికారుల నిర్లక్ష్య స్వభావం అరికాలిమంట నెత్తికెక్కుస్తుంది. వేరొకవైపు దేశంలోని నేటి రాజకీయ దుస్థితి. వీటి మధ్యపడి ప్రజాసామాన్యం నలిగిపోతుంది. ఎటుచూచినా నిరాశ కలిగిస్తున్న యీ పరిస్థితుల్లో ప్రజాసామాన్యానికి యింతో, అంతో ఆశ పుట్టించి, కార్యసాధనకు దారి చూపిస్తూ వున్నది ఒక్క కమ్యూనిస్టు పార్టీయే. ఆ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నడుస్తూన్న యువకవర్గమే యీ నాడు అన్నిచోట్ల ప్రజలకు తోడుపీడగా నిలిచి వారి బాధలను నివారించే మార్గాలను ఆలోచిస్తూంది. అసంతృప్తి, అశాంతులు పెరగకుండా ప్రజలకు తగిన సౌకర్యాలు కలిగించి, యుద్ధ ప్రయత్నాలకు వారి సహకారం పొందవలసిన అధికారవర్గం, ప్రజల యిబ్బందులపట్ల దారుణమైన నిర్లక్ష్యవైఖరి కనబరచడమే కాకుండా వాటిని హేళన చేస్తున్నారు కూడాను. ఇలా ప్రవర్తిస్తున్నది బాధ్యతగల అధికారవర్గమేనా లేక, ఇది చిలిపిచేష్టల చిల్లరగుంపా అన్న సందేహం కల్గుతూంది.

దీన్నే మనాలి ?

నర్సారావుపేటలో కొన్నాళ్ళక్రిందట కూలీలందరూ డిప్యూటీకలెక్టరు దగ్గరకి పోయి చౌకధరల డిపో చాల అవసరమని ఒత్తిడి చేశారు. ఆ ఒత్తిడి ఫలితంగా జొన్నలు కొంచెంచౌకగా అమ్మే యేర్పాట్లు చేశారు. అది కారుణ రెండు నెలలు ఇలా అమ్మిన తరువాత ఇక చాలనుకొన్నారు కాబోలు, ఇరవైరోజుల క్రిందట ఈ అమ్మకం ఆపివేశారు. ఇక్కడి కమ్యూనిస్టులు వెంటనే ప్రజలలోకి వెళ్ళి వారిని కార్యదీక్షకు పురికొల్పారు. చౌకధరల డిపో వెంటనే ఏర్పాటు చేయాలని ఒక పిటీషన్ తయారుచేసి దానిమీద 420 సంతకాలు పెట్టించారు. దీనిని కలక్టరువద్దకు తీసుకువెళ్ళి, ప్రజల అవసరాన్ని వివరిస్తే ఆ కలక్టరుదొరగారు ఏమి జవాబిచ్చాడో చూడండి. తిండి లేకపోతే రంగూన్ గెల్చుకురాండి—కావలసినన్ని రంగూన్ బియ్యం దొరుకుతాయని హేళన చేశాడు. సైన్యంలో చేరుతే కావలసినంత తిండి దొరుకుతుందని చెప్పాడు. ప్రభుత్వ మిలిటరీ సన్నాహాలకు ప్రజల సహకారం పొందేమార్గం వీరి కింకొకటి కనబడలేదు కాబోలు. దేశరక్షణకు, మహత్తర త్యాగాలకు, ప్రజల్ని పురికొల్పేది దేశభక్తి కాని, కరువు కాటకాలు, ఆకలిమంటలు ఎంతమాత్రం కావనే ప్రాథమిక పాఠాన్నయినా ఈ అధికారులు నేర్చుకోకపోవడం వింతగా వుంది.

"పైనుంచి వుత్తరువు"

వెంకటగిరిలో జమీందారు అదుపాజ్ఞల్లో ఒక సహకార సంఘముంది. అక్కడ అన్ని వస్తువులు కంట్రోలు ధరకే దొరుకును. కాని, ఆ దొరకడం ప్రజాసామాన్యానికి కాదు, సహకార సంఘ సభ్యులకు, వారిదృష్టిలో వున్న ఇతరులకు మాత్రమే. బియ్యం మాత్రం ప్రజలందరికీ అమ్ముతున్నారు. కాని ఏమి ప్రయోజనం? ఊరంతటికీ వున్నది ఇదొక్కటే దుకాణం. సాయంత్రం నాలుగు గంటలకు సుమారు నాలుగువేలమంది. ఈ కొట్టుదగ్గర ప్రోగవడం, వీళ్లందరికీ బియ్యం కొలిచి ఇవ్వడానికి ఒక వ్యక్తికన్నా ఎక్కువ మంది లేకపోవడం వల్ల చీకటిపడిన తరువాత చాలమంది బియ్యం దొరక్క కాళ్లీడ్చుకుంటూ ఇంటికి పోవడం మామూలయింది. కమ్యూనిస్టు యువకులు ఇదిచూచి సహించలేక పోయారు. వెంటనే ఆ కొట్టు గుమాస్తా దగ్గరకు వెళ్లి, బియ్యం కొలుస్తామని చెప్పారు. అతను సంఘ అధ్యక్షుని అనుమతి తీసుకోవాలన్నాడు వెంటనే ఇద్దరువెళ్లి అధ్యక్షునితో మాట్లాడారు. అతను సంతోషంతో అనుమతి ఇచ్చాడు, అనాడే మన కామ్రేడ్సు పనిప్రారంభించారు. స్త్రీలను పురుషులను వేరుచేసి, వేరువేరుగా బియ్యం కొలిచారు. అందరికీ బియ్యం దొరకడం అనాడే మొదటిసారి, ఒకొక్కరికి ఒక శేరు మాత్రమే కొలవాలని రేషనింగు నియమము. పాపం, కొందరు ఎక్కువ తీసుకోవాలనే ఆదుర్దాతో కామ్రేడ్సు చేతిలో ఎక్కువ సొమ్ము వేసేవారు. కామ్రేడ్సు శేరు ఖరీదు మాత్రం తీసుకొని, మిగిలాది తిరిగి ఇచ్చి వారికి నచ్చచెప్పేవారు. మరునాడు వేగిరంగా కామ్రేడ్సు కొట్టుదగ్గరకువెళ్లారు స్త్రీలను పురుషులను వేరువేరుగా నలుగురేసి చొప్పున బారులు తీర్చికూర్చోపెట్టారు. అంతా చాల డిసిప్లిన్డ్‌గా ఏర్పాటు చేశారు. ఇంతలోనే పెదుగులా గుమాస్తావచ్చి, వారు చేసిన సేవకు అభివందనాలు తెలుపుతూ ఇక వారిని వెళ్లిపొమ్మన్నారు. ఎందువల్ల అని అడిగితే "పైనుంచి వుత్తరువ"న్నాడు. కామ్రేడ్సు సహకారం జమీందారుకి కంటిలోనలుసయింది. సంఘాధ్యక్షునికి ఇది ఆశ్చర్యం కలిగించింది అప్పటికి గత్యంతరంలేక కామ్రేడ్సు తిరిగి వచ్చారు. ప్రజలు నిరాశతో ఎంతో దిగులు పడ్డారు. కాని ప్రజలందరూ ఏకమైతే జమీందారుమాత్రం అడ్డగలడా ?

భట్టిప్రోలులో

ఐక్యతద్వారానే కష్టాలను తీర్చుకోగలమని భట్టిప్రోలు ప్రాంతంలో జరిగిన యీ క్రింది ఘటన తెలుపుతూవుంది. భట్టిప్రోలు, అద్దేపల్లి, కోనేటిపురం గ్రామాలలోని ఖద్దరు నేతవారు యీ కరువురోజుల్లో తమ జీతాలు నాలుగణాల నుంచి అయిదణాలకు హెచ్చుచేయవలసిందని కోరారు. దీని విషయం షాహుకార్లతో చర్చించడానికి ఐదారుగురు సభ్యులుగల ఒక కమిటీని ఎన్నుకొన్నారు. నేతవారందరూ ఒకటై ఈ హెచ్చుదలను కోరుతున్నారన్న విషయం గుర్తించి షాహుకార్లు మారు మాటాడకుండా జీతం హెచ్చుచేశారు. ఐక్యతఫలితాన్ని అనుభవించిన ఆ నేతవారు ఐక్యతావుద్యమానికి తోడ్పడుతున్నారు. బీదవారే అయినప్పటికీ తమ శక్తికొలది పార్టీఫండుకి విరాళాలిచ్చారు.

మన దేశంలోని రాజకీయ పరిస్థితిని ప్రజల కళ్ళకు కట్టినట్లు విశదీకరించడానికి ఇవికొన్ని నిదర్శనాలు. ప్రజల కష్టసుఖాలను సానుభూతితో గుర్తించగలజాతీయప్రభుత్వం దేశంలోవుంటే, ఈ క్లిష్టపరిస్థితిలో అధికారుల ప్రవర్తన ఇలా వుండజాలదు. ప్రజలందరూ ఏకమై, అంతర్భేదాలను మరచి పోయి, ఒకరి హక్కులను ఒకరు అంగీకరిస్తూ, ఏకముఖంగా ఏకకంఠంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జాతీయ ప్రభుత్వాన్ని సాధించడమే ఈ నాడు మన ప్రధానసమస్య అని చెప్పడానికి ఇవి కొన్ని వుదాహరణలు.

యుద్ధ అలవెన్సుకై రైల్వేకార్మికుల ఆందోళన

(కామ్రేడ్ కె. యల్. నరసింహం)

ఇండియా ప్రభుత్వ సభ్యుడైన సర్ ఎడ్వర్డుబెంథాల్ యీ నెల 4వ తేదీని రేడియోలో ప్రసంగిస్తూ, యిలాచెప్పాడు :—

"యుద్ధం ప్రారంభమై నప్పట్నించీ, భారతదేశంలో వున్న ట్రాన్‌స్పోర్టు కార్మికులపై ఎక్కువ భారం పడింది. ప్రజల ఆహార పదార్థాలను ఒకచోటు నుంచి మరొక చోటికి రవానా చేస్తూ, ట్రాన్‌స్పోర్టు కార్మికులు తమ దేశానికి నిరంతరసేవ చేస్తున్నారు. వారి సహాయంతో భారతదేశం, ఇతరమిత్రరాజ్యాల సేనలు, కలిసి జపాన్ హంతకుల్ని దేశ సరిహద్దులకురాకుండా తరిమివేయగలవు.

ఇంత ప్రధానపాత్రను నిర్వహించవలసిన రైల్వేకార్మికులు నేడుపడే అవస్థలు వర్ణనాతీతం. వారికి యిచ్చే కనీసవేతనాలు అతి స్వల్పం. యుద్ధంవల్ల ఆహారపదార్థాల ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నాయి. వారు నిర్మాణయుక్తంగా సాగించిన అనేక పోరాటాల ఫలితంగా రైల్వేబోర్డు జూన్ 15 నుంచి "జోన్ల" పద్ధతిప్రకారం యుద్ధఅలవెన్సు యిచ్చింది. మద్రాసులో రు. 110 లోపు పనివారలకు రు. 10—8—0; 50,000 మంది జనాభాగల పట్టణాలలో రు. 90 లోపువారికి 8—12—0; యితరచోట్ల రు. 60 లోపువారికి రు. 7—0—0 యివ్వబడుతూంది.

కార్మికుల కోర్కెలు

ఈ విధంగా రైల్వే కార్మికుల్ని మూడు విధాలుగా చీల్చి, అలవెన్సు ఇవ్వడంసరికాదు. అసలే ఈ అలవెన్సు, ధరల పెరుగుదల కనుగుణ్యంగా లేదు. ఆధరలైనా స్థిరంగావుండక, రోజురోజుకు పెరుగుతున్నాయి. అదీగాక, యుద్ధఎలవెన్సు కార్మికులందరికీ ఒకే రేటు ప్రకారం ఈయక, వారిలో వారిని విభజించటం మరీ అన్యాయం. రాయలసీమలో పనిచేసే కార్మికులందరూ మూడవ "జోన్" క్రిందికి వచ్చారు. ఆప్రాంతాలలో క్షామ దేవత ప్రజల్ని పీల్చి పిప్పిచేస్తుంది. అయినప్పటికీ, బళ్లారి గుంతకల్, ధనుకొండ, వగైరా స్థలాలలో పనిచేసే కార్మికులకు యుద్ధ ఎలవెన్సు ఏ మాత్రం హెచ్చించలేదు. ఈ కారణాల వల్ల ఆంధ్ర రాష్ట్రంలోవున్న పనివారలందరూ తమ తమ సంఘాలద్వారా, ప్రస్తుతపు "జోన" పద్ధతిని రద్దుపరచి రు. 200 లోపు జీతంతీయువారందరికీ కనీసం రు. 15 చొప్పున యివ్వాలని ఆందోళనచేస్తున్నారు. ఈ పద్ధతిని నిరశిస్తూ బళ్లారి, గుంతకల్, ధనుకొండలలో రైల్వేకార్మికులు జీతాలు తీసుకోకుండా తమ అసంతృప్తిని ప్రకటించారు.

వివిధ ప్రాంతాలలో ఆందోళన

బెజవాడలో విరివిగా రైల్వే కార్మికుల సభలు యేర్పాటుచేసి, పైకోర్కెకై తీవ్రంగా ఆందోళన సాగిస్తున్నారు. రైల్వే ఏజంటుకు మహాజర్లు పంపుకుంటున్నారు. గుంతకల్‌లో 1-12-42 న కామ్రేడు గోవిందులు అధ్యక్షతను జరిగిన సభలో ఎం. ఎస్. ఎం. రైల్వే ఎంప్లాయీస్ సంఘాధ్యక్షులైన ఎస్. గురుస్వామిగారు ఉపన్యసిస్తూ, కార్మికులకోర్కెను బలపరిచారు. ఆహారపదార్థాల ధరల కనుగుణ్యంగా కార్మికులకు ఎలవెన్సు ఎక్కువచేయాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించబడింది. 8-12-42 న రాజమండ్రిలో "హెచ్చు యుద్ధ ఎలవెన్సు దినం"ను రైల్వేకార్మికులు జరిపారు. సాయంత్రం కార్మికుల ఊరేగింపు, బహిరంగసభ, జరిగాయి. వందలకొద్ది కార్మికులు పాల్గొన్నారు. సభకు ఎం. వి. సుబ్బారావుగారు. అధ్యక్షత వహించారు. జోన్ల పద్ధతి రద్దుకావాలనీ, యుద్ధ ఎలవెన్సు ఎక్కువ చేయాలనీ చౌకడిపోలు ఏర్పాటు చేయాలనీ, సభలో తీర్మానించారు. చిట్టగుంట రైల్వే కార్మికులు కూడా పైకోర్కెను బలపరుస్తూ ఆందోళన గావిస్తున్నారు.

దేశ రక్షణలో రైల్వేలు ప్రధాన భాగం. యుద్ధంచేస్తూన్న సైన్యాలకు సప్లయిలు ప్రజాసామాన్యానికి ఆహారపదార్థాల సరఫరా, నిరంతరం సక్రమంగా జరగాలంటే, రైల్వేకార్మికులు ధైర్యంతో రైళ్లనడపాలి. విమానదాడుల సమయంలోకూడా రైల్వేకార్మికులు పనిజేస్తూ, సైన్యాలను, ప్రజలను ఒక చోటినుండి మరియొక చోటికి సురక్షితంగా జేర్చ వలసియున్నది. ఇట్టి రైల్వేకార్మికులలో అసంతృప్తికి తావివ్వటం అంటే, మన దేశరక్షణప్రయత్నాలను భంగపర్చటం అవుతుంది. అంతే కాకుండా రైల్వేలపైన ఆదాయం ఈ సంవత్సరం క్రిందటి సంవత్సరం కంటే 9 కోట్లు పెరిగిందికూడాను. 1938-39 సం॥నుంచి లెక్కలు వేస్తే 140 కోట్లవరకు ఆదాయం వస్తూవున్నట్లు తేలుతుంది. యింతఆదాయం వస్తూవున్నా, కార్మికుల న్యాయమైనకోర్కెలను యివ్వకపోవటం సహించరాని విషయం.

రైల్వేకార్మికుల ప్రధానపాత్రను అంగీకరించిన బెంగాల్ ప్రభుత్వ సభ్యుడు ఈ యదార్థాన్ని గ్రహించవలసియుంటుంది.

గూడూరు మైకా యజమానుల అధర్మ ప్రవర్తన

గూడూరు డివిజన్ మైకా కార్మికులలో ఇటీవల నేను, మరి యిద్దరు కామ్రేడ్సు కలిసి, ప్రచారం చేశాం. పనివారల కష్టాలకు హద్దులేదు. చట్టం ప్రకారం 9 గంటలకు మించి యే పనివాడు గనిలో పనిచేయకూడదు. కాని, యజమానులు దరిదాపు 12 గంటలవరకు పనిచేయించుకుంటున్నారు. ఈ 12 గంటల పనికి కూలి 0—8—0. అది కూడా పేరుకు మాత్రమే. ఎందువల్లనంటే, ప్రతి వారం కూలి యివ్వరు. కొన్ని గనులలో 3 నెలలకొకసారి యిస్తున్నారు. మేము తురిమెళ్ళలో వుండగా అక్కడి కాంగ్రెసు యజమాని గనిలో సహితం 3 నెలల కొకసారి కూలి యిస్తారని తెలుసుకున్నాం. అయితే ఈ 3 నెలల పర్యంతము కార్మికులేరీతిగా బ్రతుకుతారని అడుగవచ్చు. ఈ 3 నెలలలో కార్మికులకిచ్చే కూలికి బదులు చీటీలు యిస్తారు. ఆ చీటీ చూపిస్తే గని యజమానితో ప్రత్యక్ష సంబంధం వున్న ఒక అంగడిలో సరుకు దొరుకుతుంది. ఆ అంగడి యజమాని కేవలం మట్టరకపు సరకు కూలీల నెత్తిన రుద్దుతాడు. ఎక్కువ ధరలు వేస్తాడు. తక్కువ కొలతలు కొలుస్తాడు. చీటీ చూపించి, రొక్కం యిమ్మని అడిగితే 1—0—0 కు 0—12—0, అంతకు తక్కువ యిస్తాడు.

పని చాలా ప్రమాదకరం

మైకా గనులలో పని చేయడం అతి ప్రమాదకరం. కొండలలోను, రాళ్ళలోను పెద్ద పెద్ద రంధ్రాలు కొట్టాలి. ఆ రంధ్రాలలో మందుపెట్టి, తూటా వెలిగించాలి. రోజుకు యిన్ని గంటలు అని మాత్రమే కాకుండా, యిన్ని రంధ్రాలు కొట్టాలని విధిస్తారు. ఈ విధంగా, యెట్టి విశ్రాంతి లేకుండా పనిచేయడంవల్ల కార్మికుల కనేక ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రాణనష్టం కూడా కలుగుతుంది. చట్టం ప్రకారం యజమానులిట్టి ప్రమాదాలను గురించి ప్రభుత్వాధికారికి తెలియజేసి, నష్టపరిహారం యివ్వాలి. కాని యజమానులు అసలు రిపోర్టు చేయక, చట్ట ధిక్కారము చేస్తున్నారు. ఒక గనిలో ఒక పనివాని కాలిమీద పెద్ద మట్టిపెళ్ళ పడి గాయం తగిలితే, గని యజమాని తన ఆవరణలోనే 15 రోజులు ఉంచుకొని రిపోర్టు చేయలేదు. మేమీ విషయమై విచారించబోతే యితర కార్మికులు భయముతో వివరాలు చెప్పడానికి వెనుదీశారు.

కట్టుమూడిపల్లె, కలిచేడు, గిద్దలూరు, ఊటుకూరు మొదలైన ప్రదేశాలలో మేము బహిరంగసభలు జరిపి, కార్మికుల కష్టాలను గురించి ఉపన్యాసాలిచ్చాం. చీటీల పద్ధతి పోవాలనీ, కరువు భత్యం యివ్వాలనీ, ప్రమాదాలు రిపోర్టు చేయాలనీ, కానులతో సహా కూలి రొఖ్ఖంగా యివ్వాలనీ, చౌక ధరల అంగళ్ళు స్థాపించాలనీ, ఆ యా సభలలో తీర్మానాలు జరిగాయి. ఎక్కువ ధరల ఇబ్బందుల్ని గురించి కార్మికులు ప్రతిచోట మొఱ పెట్టుకున్నారు.

సబ్‌కలెక్టరు వద్దకు డెప్యుటేషన్

ఆహారపదార్థాల ధరలు విపరీతంగా పెరగడం వల్లను, అసలు సరకు దొరక్కపోవడం వల్లను, మైకా కార్మికులు పడే అవస్థలకు అంతులేదు. బియ్యం రూపాయకు 8 శేర్లు అయినా అమ్మించవలసిందనీ, గూడూరు టవున్‌లో ఇప్పుడున్న చౌకడిపో ప్రజలందరికీ సకాలంలో సప్లయి చేయడం లేదు కాబట్టి మరొక డిపో స్థాపించాలనీ, కిరసనాయిల్ అందరికీ దొరికేలాగున ప్రతియింటికి అర్థమంచీ సీసా చొప్పున యిచ్చేరేషన్ కార్డులుపంచి పెట్టాలని కోరుతూ గత మాసం 29, 30 తేదీలలో బహిరంగసభలు జరిగి తీర్మానించబడింది. ఈ నెల 5 వ తేదీని కామ్రేడ్సు సుబ్బయ్య, జానకిరామయ్య, సుబ్బరామయ్య, సూర్యనారాయణ సింగ్ గారల నాయకత్వాన 1000 మంది కార్మికులతో గూడూరు సబ్‌కలెక్టరు వద్దకు డెప్యుటేషన్ వెళ్ళారు. పైకోర్కెల ప్రాధాన్యతను తెలియజేశారు. కాని, కార్మికుల గోడు కలెక్టరుకు పట్టినట్లుగా తోచదు. కార్మిక నాయకులు చెప్పే విషయంలో నిజానిజాలు తెలుసుకొని, ఆతర్వాత తాను చేయగలిగినది చేస్తానన్నాడు. బియ్యం సప్లయి యెక్కువగా లేదు కాబట్టి రూపాయకు 8 శేర్లు యివ్వడం కష్టమన్నాడు. కిరసనాయిలు సప్లయి యిన్నివందల కుటుంబాలకు రేషన్ కార్డులివ్వడం సాధ్యంకాదన్నాడు.

యుద్ధ కార్యములకుపయోగపడు మైకా ఒక్కరాత్రికి 1000 టోనులు చొప్పున తయారగుచుండును. మైకా విరివిగా ఉత్పత్తి చేయవలసిన యీ రోజులలో కార్మికుల న్యాయమైన కోర్కెలను యీడేర్చుట ప్రభుత్వ ధర్మం; యజమానుల కర్తవ్యం.

— కామ్రేడ్ ఖండవల్లి కృష్ణారావు

ఐకమత్యమే అంత్య విజయం

కామ్రేడ్ కోటీశ్వరరావు.

("ఓ పలనాటి యలమంద—" మాదిరి)

ఓ పల్లెటూరి పల్లెకాపా ! వల్ల మాలిన యుద్ధమొచ్చేరా
కన్నబిడ్డల కాల్చుకొనితిను కరువు గూడా దాపురించేరా
చెమట కాల్వలు చేలునింపీ, మేనినెత్తురు వారబోసిన
నీదు చాకిరి నీటగలిసావా ?
ఓ కాలమెరుగని కష్టజీవీ !
కన్నులిప్పీ చూడకున్నావా ? ॥ఓ పల్లె॥

యుద్ధజ్వాలలు కమ్ముకోని దద్దరిల్లితె లోకమంతా
సద్దు సేయక నిద్దరోతావా ?
ఓ సత్తెకాలపు చల్లనయ్యా !
చెయ్యిముడుచుక కూరుచుంటావా ? ॥ఓ పల్లె॥

దుష్టులగు ఫాసిస్టు వర్గము దోపిడీకై లోకమంతా
యుద్ధజ్వాలల నిగుడజేశారు—
ఓ మర్మమెరుగని కర్మజీవీ !
ఐకమత్యము భంగపరిచారు ॥ఓ పల్లె॥

దురములోన తరుము కొచ్చే దుష్టశక్తుల నురుముజేయగ
ఐకమత్యమె ఆయుధమ్మోయి !
ఓ కాకదీరిన కష్టజీవీ !
సుత్తికొడవలి ఎత్తిచూపోయి ॥ఓ పల్లె॥

రక్తమాంసము పీల్చివేసే, రక్కసులరాజ్యమ్ము పోయీ
రైతు కూలీ రాజ్యమే తెంచున్
ఓ పస్తులుండే బక్కవాడా !
ఐకమత్యము కండగావోయి ॥ఓ పల్లె॥

ఆకలేసీ కేకలేసే కాకి కోకమ్మ స్తమించి
సర్వమానవ సౌఖ్య ముదయించున్
ఓ నిర్మలాంతఃకరణమూర్తీ !
ఐకమత్యమె అన్ని సమకూర్చున్ ॥ఓ పల్లె॥

గమిడిగానిన రక్కసీంద్రను సమయజేసే మారణాస్త్రము
ఐకమత్య మ్మొక్కటేనోయి !
ఓ సాటిలేని మేటిసర్దార్ !
అంత్యవిజయము నీదె నమ్మోయి ॥ఓ పల్లె॥

ఒకరి గొంతుక లొకరుగోసే ఊరిలోన నూరుపార్టీల
వద్దురా ఈ యుద్ధసమయాన
ఓ స్వచ్ఛమైన స్నేహశీలీ !
ఐకమత్యమె అంత్యవిజయమురా—
ఓ పల్లెటూరి పల్లెకాపా॥

విజ్ఞాన విధ్వంసం

నాజీ ప్రభుత్వ విధానం

ఫాసిజం వచ్చాక జర్మన్ విశ్వ విద్యాలయాలలో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయిన మాట నిజమే. 1933 లో 1,33,000 మంది విద్యార్థులుంటే, 1939 లో యీ సంఖ్య సగానికి తగ్గించబడింది. అయితేనేం? ఫాసిస్టు నాయకుల ఉద్దేశంలో అక్కడి విద్యార్థులకుండవలసిన లక్షణాలన్నీ వారికున్నాయి. 1935 తరువాత జర్మన్ విశ్వ విద్యాలయాలలో పట్టభద్రులైన యువకులందరూ ఫాసిస్టు సిద్ధాంతాలలో ఆరితేరినవారే. వారెక్కడ పనిజేస్తే అక్కడ ఫాసిస్టు సిద్ధాంతాలు ప్రచారం చేయడంలో మంచి నైపుణ్యం సంపాదించారు.

ఉత్త చవటలు

ఉన్న విద్యార్థులలో ఉత్త చవటలకు ప్రోత్సాహమీయడం నాజీ నాయకుల సిద్ధాంతం. కనుకనే విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గించవలసివచ్చింది. 1939 లో విద్య నభ్యసించిన 60,000 విద్యార్థులు విజ్ఞాన శూన్యులైనప్పటికి, రక్తనకాండ రాక్షస చర్యలలో చక్కని తరిఫీదు పొందినవారు. సారస్వతం, కళ, భాషా పరిశోధన, మొదలైన శాఖలలో శాస్త్రాభివృద్ధి లేనేలేదని చెప్పాలి. ఎందువల్లనంటే, ఫాసిస్టు సిద్ధాంతాల కనుగుణ్యంగా వీటిలో గ్రంథాలు వ్రాయడానికి మేధాశక్తి యొక్క అవసరం లేదు. తగు మాత్రం కుయుక్తి, నక్కజిత్తులు వుంటే చాలు.

యుద్ధ నిర్వహణానికి శాస్త్ర పరిశోధన

కాని యుద్ధ నిర్వహణ కవసరమైన మారణ యంత్రాలలో ఎంతైనా శాస్త్రపరిశోధన జరుగుతోంది. ఆశాఖలో తెలివితేటలున్న విద్యార్థుల్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

రచన
జరైన్ కుజిన్స్కీ

పరిశోధనల కెంత ధనమైనా ఖర్చుపెడుతుంది. జర్మనీలో మారణ యంత్రాల పరిశోధన కీయబడుతూన్న విలువ ప్రపంచ చరిత్రలో యెప్పుడూ, ఎక్కడా ఈయబడలేదు. పరిశోధనాలయాలలో పెద్ద పెద్ద జీతాలిచ్చి కొత్త పదవులు రోజురోజుకుఎక్కువగాసృష్టించబడుతున్నాయి. ఇన్నిపదవులు ఒక్క సోవియట్ రష్యాలో తప్పమరే దేశంలోను లేవు. అయితే, సోవియట్ రష్యాలో ప్రభుత్వం మానవాభ్యుదయమే ప్రధానంగా పెట్టుకున్నది కాబట్టి, అందుకు దారితీసే పరిశోధనలకు ప్రోత్సాహమిస్తుంది. కాని జర్మనీలో, మారణ యంత్రాల పరిశోధనకు మాత్రమే ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుంది.

సామ్రాజ్య పరిపాలన

ప్రపంచ మంతటా ఫాసిస్టుల సామ్రాజ్యం యేర్పడాలని జర్మనీ ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం. అంత పెద్దసామ్రాజ్యాన్ని పరిపాలించే పద్ధతులు నేర్పి, యువకుల్ని తరిఫీదు చేయడం అవసరం. హాంబర్గ్ విశ్వవిద్యాలయంలో యిట్టి తరిఫీదు ఇస్తున్నారు. అడవులు, పర్వతాలు, ఎక్కువగా ఉండి, అధిక వేడిమివల్ల జయస్థేరే వ్యాధుల్ని గురించి, వాటి చికిత్సనుగురించి హాంబర్గ్ యూనివర్సిటీలో నేర్పుతారు. వలస దేశాల ప్రజలు ప్రతియేటా ఇట్టి వ్యాధులకు గురిఅయి, హతులైపోతూంటే, వారి శరీర దారుఢ్యం అంతా వ్యర్థమైపోతుంది. వారి ప్రాణాలు కాపాడబడితే, తమ పరిశ్రమలకు, వాణిజ్యానికి, వారు చక్కగా పనికివస్తారు. కాబట్టి, వైద్యశాస్త్రంలో పరిశోధన సామ్రాజ్య నిర్మాణంలో ప్రధాన పాత్రను వహిస్తుంది. ఇంతేకాదు. ఆఫ్రికా దేశాలలో నివసించే వివిధ జాతుల భాషలు హాంబర్గ్ యూనివర్సిటీలో అభ్యసించబడు తున్నాయి.

బెర్లిన్ యూనివర్సిటీ

బెర్లిన్ యూనివర్సిటీలో మిలిటరీ శాస్త్రం యెక్కువ ప్రాధాన్యత వహిస్తోంది. యుద్ధ వ్యూహం, యెత్తుగడయ, కార్మికుల జీతాలు, సైనికుల ఆహార విహారాలు, ముడిపదార్థాల సప్లయి మొదలైన సమస్యలు యీ యూనివర్సిటీలో బోధించబడతాయి. ప్రజల ఉత్సాహం, పట్టుదల, క్షీణించకుండా యుద్ధంలో గెలవడమెలాగ? అనే సమస్యపై ప్రొఫెసర్లు విద్యార్థులు, పరిశోధనలు జరుపుతారు.

లీప్జిగ్ యూనివర్సిటీ

ఇక లీప్జిగ్ యూనివర్సిటీకి వద్దాం. పత్రికలద్వారా నేర్పుతో ప్రచారంచేయడం ఇక్కడ అభ్యసిస్తారు. ప్రజల్ని యెంతవరకు మభ్యపెట్టవచ్చు? కొన్ని ముఖ్య సూత్రాలను ప్రజల మనస్సులో పాతుకుపోయేటట్లు చేయడానికి ఉపాయాలేమిటి? ఒక విధానాన్ని అకస్మాత్తుగా విడిచిపెట్టి, మరొక క్రొత్త విధానాన్ని అనుసరించేటప్పుడు రెండింటికీ మధ్య వైరుధ్యము లేదని చూపడమెలాగు? ఇవీ, ఇంకా యెన్నో యిలాంటి సమస్యలపై లీప్జిగ్ యూనివర్సిటీలో పరిశోధనలు జరుపుతారు.

ఆక్రమిత యూరప్‌లో

జర్మనీ అనేక యూరపియన్ దేశాలను స్వాధీనపరచుకొన్నాక, ఆయా దేశాలలో యూనివర్సిటీ విద్యను చేతనైన తవరకు నాశనం గావించడమే పాలసీగా పెట్టుకొంది. అక్కడక్కడ పంచమాంగదళాన్ని తరిఫీదు చేయడానికి మాత్రం కొన్ని విశ్వ విద్యాలయాలు తాత్కాలికంగా ప్రోత్సహించబడుతాయి. అట్టి దేశాలలో జర్మనుజాతి ప్రజలు యేమాత్రం జనాభా ఉన్నప్పటికి, వారికి ప్రత్యేకంగా ఒక పెద్ద విశ్వవిద్యాలయాన్ని నిర్మించి, అక్కడికి యితర యూనివర్సిటీల తాలూకు గ్రంథాలయాలు, పరిశోధన సాధనాలు, తీసుకొచ్చి, స్థాపిస్తారు. ఎప్పటికైనా ఆ దేశాన్ని పరిపాలించవలసినది అల్ప సంఖ్యాకులైన యీ జర్మనులే కాబట్టి, అట్టి యూనివర్సిటీలలో జర్మను పరిపాలకుల్ని తరిఫీదు చేస్తారు.

కాబట్టి, ఫాసిజంలో శాస్త్రాలు నాశనం చేయబడతాయనుకోవడం పొరబాటు. అంతకంటె ఘోరం జరుగుతుంది శాస్త్రాలు వక్రమార్గాలలో ప్రోత్సహించబడతాయి. ఈ నాడు సహితం జర్మన్ యూనివర్సిటీలలో కొత్త కొత్త మారణయంత్రాలు కనిపెట్టబడుతున్నాయి. కొత్తకొత్త పరిశోధనలు జరుగుతున్నాయి. జర్మన్ మిలిటరీ యంత్రానికి ఈ రోజున యింతబలం ఉన్నదంటే, జర్మన్ యూనివర్సిటీలు కూడా యిందుకు యెంతో సహాయపడుతున్నాయి.

— "స్టూడెంట్" నుండి.

కీలుబొమ్మ ప్రభుత్వాలు — జపాను కుతంత్రం

హాంకాంగ్‌పై జపాను దురాక్రమణ జరిగేటప్పుడు — జపాన్ ఏజెంట్లూ, పంచమాంగదళంవాళ్ళూ కొనసాగించిన దుష్కృత్యాలను కళ్లారచూచే అవకాశం కలిగిన — ఒక పెద్దమనిషి — ఈమధ్య — కలుసుకోవటం తటస్థించింది. జపాన్ యమదూతల చేతులలోంచి మహాప్రయాసతో బ్రతికి బయటపడి మనదేశానికి వచ్చారు వీరు. అందువల్ల ఆక్రమిత దేశాలలో జపాను ముష్కరులు కొనసాగించే కుట్రలూ, తతంగాలూ వీరికి బాగా తెలుసు.

ఆక్రమిత దేశాలలో జపానువాళ్ళు కీలుబొమ్మ ప్రభుత్వాల్ని స్థాపించడానికి చేసే తతంగాలనుగూర్చి మన మాతృదేశ రక్షణకు ఎంతో ఉపయోగపడే అమూల్య విషయాలను వీరు తెలియజేశారు

జపానువాళ్ళు హాంకాంగు నాక్రమించుకోకపూర్వం అక్కడి సాంఘిక, రాజకీయ విషయాల్లో అగ్రస్థానం వహించి, చైనా, బ్రిటిష్ ప్రభుత్వాలతో సన్నిహిత సంబంధమున్నటువంటి వాళ్ళే — హాంకాంగ్ నాక్రమించుకొన్నాక జపానువాళ్ళు ఏర్పాటుచేసిన కీలుబొమ్మ ప్రభుత్వంలో తగుదునమ్మా అని తయారయ్యారు జపానువాళ్ళు అడుగు పెట్టగానే, ప్లేట్ మార్చి వంగివంగి సలాములుకొట్టారు.

"భారత స్వాతంత్ర్య సమితి"

ఇలాంటి దేశద్రోహుల్ని తయారుచేసి స్వాతంత్ర్య ప్రియులగు భారతీయుల కళ్లల్లో కారం కొట్టడానికి జపాను వాళ్లు "ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్" అనే పేరుతో ఒక ముఠాను చేరదీశారు. వీళ్లే మనపాలిటి పరమ శత్రువులు. ఈ సంఘం యొక్క ప్రధాన కార్యస్థానం జపాన్‌లోనూ. ఉపశాఖలు షాంగ్‌హై, మలయా, హాంకాంగ్‌లోనూ ఉన్నాయి.

దీంట్లో చేరిన వాళ్లందరికీ పంచమాంగదళపు పనులు చేయటానికి ట్రైనింగ్ యిస్తారు. భారతదేశానికి సంబంధించిన సర్వ వ్యవహారాల్లోనూ వీరికి శిక్షణ యిస్తారు ఎవరెవరు, ఏయేప్రాంతాలకు వెళ్లాలో, ఏవిధంగా తమ ఏజెంట్లను తయారు చెయ్యాలో, ఎక్కడెక్కడ ఏమేమి చెయ్యాలో వీళ్లకు బోధిస్తారు.

పంచమాంగదళానికి ట్రైనింగ్

మన భారతదేశాన్ని స్వాధీనం చేసికోటానికి కూడా జపానువాళ్ళు ప్లానులు తయారు చేశారు. మన దేశంలో కూడా పంచమాంగదళం తయారుగాఉంది. జపాను ఫాసిస్టుల అడుగులకు మడుగులొత్తే యీ దేశద్రోహులు, సమయం కోసం కాచుకు కూర్చున్నారు.

"జాతీయత-దేశభక్తి" అనేపేరుతో శత్రు రేడియోలను చి మన జాతీయగీతమైన "వందే మాతరం" పాటను ప్రతిరోజూఆలాపిస్తున్నారు. "భారతదేశం భారతీయులదే" అని మన భారత స్వాతంత్ర్యాన్ని గురించిన నినాదాలను శత్రు రేడియోలనుండి ప్రతిధ్వనింపచేస్తున్నారు.

ఎంగిలి మెతుకులకోసం ఆశించి, మన పవిత్ర మాతృదేశాన్ని అమ్మజూస్తున్న యీ దేశద్రోహులు దేశభక్తి అనే తెరచాటున భాగోతమాడుతున్నారు. కాంగ్రెసు రంగుపూసుకొని, సామ్రాజ్యవాద వ్యతిరేకులగు భారత ప్రజానీకాన్ని దగాచేయాలని చూస్తున్నారు. ఈ విధంగా మనల్ని మోసగించి, మాయపుచ్చి జపాన్ సామ్రాజ్య సంస్థాపనకోసం పునాదులు వేయాలని వీరు తంటాలుపడుతున్నారు.

జపాను దండయాత్ర ప్రారంభం కాగానే, కల్లిబొల్లి జాతీయత పేరుమీద ప్రజల్ని మోసగించడానికి, దేశం నలుప్రక్కలా వీరు కమ్ముకుంటారు. హాంకాంగ్, షాంగ్‌హై, మలయాలలో తయారుచేయబడిన కీలుబొమ్మలన్నీ ఇక్కడకు కూడా దిగుమతి ఔతాయి.

బర్మా కాందిశీకులలో

బర్మా మొదలైన దేశాలనుంచి వరాలై వచ్చి కాందిశీకులతోపాటు కొందరు పంచమాంగదళం ఇదివరకే మన దేశానికి వచ్చారు.

జపాను రాక్షసులకుప్రక్కతాళంవేస్తూ ఏపాపపు పనులకైనా ఒడిగట్టే యీ దేశద్రోహుల నుంచి మనం మన ప్రజల్ని కాపాడాలి.

వీళ్ళు దేశభక్తులుకాదు. టోజోభక్తులు. మన పవిత్ర భారత స్వాతంత్ర్యాన్ని గంగపాలు చేయటానికే ఈ మహాపురుషులిక్కడ అవతరిస్తున్నారు.

వీరి వృత్తులు

వీళ్ళల్లో ఎక్కువమంది హాంకాంగ్, షాంగ్‌హై మొదలైనచోట్ల సిల్కుబట్టలు మొదలగు వ్యాపారంచేసే భారతీయ వ్యాపారస్తులలోనుంచి తయారయ్యారు వీళ్ళకు తోడు- వివక్షతవల్ల బాధలుపడుతూ, డబ్బుకోసం తయారైనవాళ్ళు కొంతమందివున్నారు.

దేశంసంగతీ, ప్రపంచంసంగతీ బొత్తిగా మరచిపోయి, నైతికంగా పతనంచెందిన వాళ్ళంతా, జపాన్ ఫాసిస్టు పిశాచాలతోపాటు బాకాలూదుతూ తైతక్కలాడుతున్నారు.

జపానువాళ్ళను వెనకవేసుకొని — దేశంలో అడుగుపెట్టగానే— ఘనమైన స్వాగతాలు జరుగుతాయని ఈ దేశద్రోహులు కలలు కంటున్నారు. వీళ్ళల్లో సిక్కులు పార్శీలు హిందువులూ, మహమ్మదీయులూ, క్రైస్తవులూ మొదలైన అన్నిమతాల వారూ వున్నారు.

జపాను మనకు స్వరాజ్యం సంపాదించి పెట్టుకుందనీ, ఆసియాఖండం నుంచి తెల్లకాకుల్ని తరిమి పారేయటానికే జపాను కత్తి కట్టిందనీ, జపాన్ అత్యాచారాలను గురించి చెప్పేవన్నీ కట్టుకథలనీ, ఇదంతా ఇంగ్లీషువాళ్ల బూటకమనీ, ఏవేవో శ్రీరంగనీతులు బోధిస్తారు వీరు.

ఆక్రమిత దేశాలలో

ఇలాంటి మాయా ప్రచారంతో మనల్ని మోసగించాలని వీరు ఎత్తులు వేస్తున్నారు. మనఇరుగు పొరుగున ఉన్న ఆక్రమిత దేశాల్లో జపానువాళ్లు కొనసాగించిన అఘాయిత్యాలను తెలుసుకుంటే, యీసంగతి చక్కగా తెలుస్తుంది.

జపాను ఆక్రమించుకొన్న దేశాల్లో వాళ్ళకు తాళంవేసే సంస్థలకు మినహా ఇతర సంస్థలను స్థాపించుకోటానికి ఆస్కారం లేదు. కార్మికుల్నీ, మధ్యతరగతి ప్రజలనూ, అనేక దశాల కాల్చుకు తింటున్నారు. జర్మనీవాళ్ల యూరపులో నూతన వ్యవస్థను స్థాపించ పూనుకుంటే, జపానువాళ్లు ఆసియా ఖండంలో ఇట్టి నినాదాలతోనే తయారయ్యారు. ఆక్రమిత దేశాల్లోని ప్రజలను మభ్యపరచి సర్వాధిపత్యాన్ని సంపాదించినతర్వాత యీ పిశాచాలు తమ నిజస్వరూపాన్ని బయటబెట్టుకుంటారు. స్వాతంత్ర్యాన్ని నామరూపాలు లేకుండా నాశనంచేస్తున్నారు. దారుణ నిర్బంధ విధానాన్ని తాండవింపజేస్తునారు. అశాంతి జ్వాలలను ప్రజ్వలింపజేస్తున్నారు.

కామ్రేడ్
ఎ. ఎస్. ఆర్. చారి

ఐక్యతా ఉద్యమ ఫలితం

(5 వ పేజీ తరువాయి) విరాళాలు కూడా యిచ్చారు. త్వరలోనే దేశభక్తులు పరిస్థితులు తగినట్లుగా నిలబడి, దేశరక్షణకు, దేశ స్వాతంత్ర్య సంపాదనకు సరియైన మార్గాన మాత్రోవస్తారనే విశ్వాసం వున్నది.

దేశాభిమానం—జాతి యభిమానం

సాధరణంగా దేశాభిమానం ప్రత్యేకజాతుల జాతియభిమానం రెండూ పరస్పర విరుద్ధభావాలనే దృక్పథం రాజకీయవాదులలో వ్యాపించి యున్నది. కొత్తగా చైతన్యంపొందుతూ, రూపం పొందుతూవున్న వివిధ జాతులు, తమ జాతీయాభివృద్ధిని కోరుటద్వారానే జాతీయోద్యమంలో పాల్గొంటారు. ఈ యధార్థాన్ని గుర్తించకపోవటమే ఈ తప్పు దృక్పథానికి, ముస్లింజాతుల గోరుతున్న స్వయం నిర్ణయ సూత్రాన్ని మత పిచ్చగా భ్రమపడుటకు ఈ తప్పుదృక్పథం దోవతీసింది.

గత జాతీయోద్యమంలోని ఈలోటు ఐక్యతా ఉద్యమంలో బహిరంగమైనది. సర్వసాధారణంగా కామ్రేడ్సు కలుసుకొన్న ముస్లింలందరూ ఐక్యతావుసరాన్ని గుర్తించినవారే; దేశరక్షణను, జాతీయస్వాతంత్ర్యాన్ని కోరుతున్నవారే; కాని కాంగ్రెసు అంగీకరించిన జగత్ నారాయణ్‌లాల్ తీర్మానం వారినింకా ఆవేశించి వున్నది. కాంగ్రెసునాయకులయెడ వున్న అనుమానాలు ఇంకా తొలగలేదు. ఇటువంటి అపాయకరమైన వాతావరణలలో కామ్రేడ్సు ప్రచారం సాగించి, కొంతవరకు అనుమానాలను, ద్వేషభావాలను తొలగించగలిగారు.

ఏలూరు తాలూకాలో ముస్లిములు కాంగ్రెసు లీగు ఐక్యతకై చొరవ తీసుకోవలసినదిగా జిన్నాను కోరుతూ, జాతీయనాయకులను విడుదలచేసి, జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పర్చవలసినదిగా వైస్రాయిని కోరుతూ, మహజర్లపై సంతకాలు పెట్టారు. ముస్లింలీగు సభ్యులు కూడా పార్టీ సూచించే పరిష్కారమార్గాన్ని అంగీకరించినా, తమకమిటీలో చర్చించనిదే మాత్రం సంతకాలు పెట్టజాలమన్నారు. ఇంకోచోట ఒక ముస్లిం గజిటెడు ఆఫీసరు పార్టీ పంథాను మెచ్చుకొని చందాయిచ్చాడు.

గుంటూరు టౌనులో కూడా ముస్లిములలో ప్రచారం ప్రోత్సాహకరంగానే యున్నది. కాంగ్రెసు ముస్లింలు అరమరిక లేమీ లేకుండా సంతోషంతో సంతకాలు చేస్తున్నారు. చదువుకున్న ముస్లిం యువకులు కూడా బహు ఆసక్తితో పార్టీపాలసీని గూర్చి విని సంతకాలు చేస్తున్నారు. లీగులోని యువకులు కూడా వారికున్న అనుమానాల నన్నిటిని అడిగి, చర్చించి, సంతకాలను పెట్టుటకు సంసిద్ధులగుచున్నారు. వారిలో ప్రచారంజేసే కామ్రేడ్సు ఇలా తెలియజేస్తున్నారు. "చాలామంది ముస్లిములకు కమ్యూనిస్టులు అంటే కుల మతాలను పాటించేవారు కావనీ, ఐక్యతకు నిజముగా పాటుబడేవారనే భావం వుంది."

రాజోలులో విషమ పరీక్ష

ఇటీవల రాజోలు తాలూకా (తూ గో. జిల్లా) లో రైతులు వ్యవసాయకూలీలమధ్య తగాదాలు హెచ్చటంవల్ల పార్టీ రైతులలో కొంత పలుకుబడిని కోల్పోయింది. ఐక్యతావుద్యమ ప్రచార ఫలితంగా పార్టీమెడ ఏర్పడిన ఈ దురభిప్రాయాల్ని పోగొట్టి ఐక్యతావుసరాన్ని గుర్తింపజేయగల్గారు అక్కడి కామ్రేడ్సు.

ఒకరైతు ఇంటికి పార్టీ నిధికి విరాళము కొరకై కామ్రేడ్సు వెళ్ళారు. ఈ విరాళాలు వసూలుజేయటానికిగల కారణాలను తెల్పారు; జాతీయైక్యతావుసరాన్ని వివరించారు కాని ఆరైతుకు నచ్చలా; వ్యవసాయకూలీ తగాదాలు ఇంకా ఆయన మనస్సులో ఆడుతున్నాయి. మన కామ్రేడ్సుతో 3 గంటలు చర్చించిన పిమ్మట పార్టీ పంథాను పూర్తిగా అంగీకరించి 10 రూ॥ లను పార్టీఫండుకు విరాళమిచ్చాడు. ఈ తాలూకాలో కలుసుకున్న ప్రతిరైతుతోనూ చాలాసేపు చర్చజరిపి ఒప్పించుతూవచ్చారు. మొత్తం మీద రైతులు, చిన్నవర్తకులనుండి 56 రూపాయలను వసూలు చేశారు.

ఆఫీసర్లూ దేశభక్తులే

విజయనగరంలో దాదాపు ప్రతిరోజూ ఒక్కొక్క పేటలో మీటింగులు జరుగుతున్నాయి. ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు, ఎక్కువగా పాల్గొంటున్నారు. జాతీయైక్యతకు దైనందిన పోరాటాలకు గల సంబంధాన్ని చూపెట్టుతూ వుపన్యాసాలిస్తున్నారు. ఇందువల్ల ప్రజలలో కమ్యూనిస్టుపార్టీ పాలసీని గూర్చి వివరంగా తెలుసుకోవాలనే కుతుహలం జాస్తి అయింది. రోజూ మీటింగు అనంతరం ఎవరోఒకరు వచ్చి పార్టీని గూర్చి, పాలసీని గూర్చి అడిగి తెలుసుకుని పోతూన్నారు. ఒక గవర్నమెంటు ఆఫీసరుకూడా 1 రూపాయి ఇచ్చి పార్టీ అమ్మే ఎఱ్ఱజండాను ఒకదానిని తీసికొన్నాడు పట్టణంలో విద్యార్థులలో ఇదివరకు సమ్మెలలో పాల్గొన్నవారు కూడా నేడు దాని విఫలతను గుర్తించి పార్టీ పాలసీని ఆమోదించి, పనిచేస్తామని వాగ్దానం చేశారు.

కళ్యాణదుర్గం (అనంతపూరు జిల్లా)లో 3 హోలు మీటింగులు జరిగాయి. ఒక్కొక్కదానికి 50 మందికి పైగా హాజరైనారు. కాంగ్రెసు పేరుతో పార్వర్డ్ బ్లాకువారు చేసే విధ్వంసక కార్యాలవల్ల దేశ రక్షణలు బలహీనపడుటేగాక, ఫాసిస్టు దాడికి యెట్లు అనుకూలపడుతున్నవో సభలలో వివరించారు. ఇట్టి దేశద్రోహులను ప్రజలకు దూరంజేసి, జాతీయ రక్షణను జయప్రదంగా యొంచాలంటే, జాతీయైక్యత అవుసరమని తెలియజేశారు.

పల్లపల్లి, అన్నారెడ్డిపాలెం, సూరాయిపాలెం మొదలగు 10 గ్రామాలలోకూడా ఐక్యతాప్రచారం సాగింది. కొన్ని గ్రామాలలో బహిరంగ సభలు కూడా జరిగినవి.

కమ్యూనిస్టులపై ప్రభుత్వ దాడి

కాంగ్రెసును చితకగొట్టడంద్వారా జాతీయోద్యమాన్ని నాశనంగావించాలని నిరంకుశాధికారుల పన్నాగం. కమ్యూనిస్టుల ఐక్యతా నినాదం యీ యెత్తును భగ్నంచేస్తోంది. సామ్రాజ్యవాదుల కుటిల నీతికి పునాదియైన చీలదీసి పాలించడమనే నిన్నాదాన్ని కూకటివ్రేళ్ళతో పెల్లగించటానికి సాగిపస్తోంది. దేశభక్తులకన్న ముందుగా ప్రభుత్వమే దాన్ని గుర్తించింది. అందుకనే ఐక్యతా వుద్యమానికి అనేక ఆటంకాలు కల్గించింది.

అనేక జిల్లాలలో రాజకీయ ప్రచారానికి అవకాశాలులేకుండా చేశారు గుంటూరులో కలెక్టరు అంగీకారంతో సభ జరుపుతూవుంటే పోలీసులు వచ్చి ఆపివేశారు. పిమ్మట సభ జరుపుకుంటానికి పర్మిషను తెచ్చుకొని, సైకిళ్ళపై ఊరేగుతూంటే, ఊరేగింపుకు పర్మిషను లేదని అభ్యంతరం పెట్టారు. కాకినాడలో ప్రకటన బోర్డులను లాక్కుపోయారు. సంతకాలు చేయించిన మహజర్లను, యెర్రజెండాలను లాక్కుపోయి, తిరిగి ఇవ్వనేలేదు. చల్లపల్లిలో జండాలమ్ముతున్న కామ్రేడ్సును అరెస్టుచేశామని లాకపులో వుంచి, నానాహింసలు పెట్టి వదిలారు. ఎర్ర జండాలు మాత్రం లాక్కున్నారు. ఆదర్శప్రాయంగా పనిజేసిన కామ్రేడ్సును అనేకచోట్ల అరెస్టుచేశారు. అయినా కామ్రేడ్సు మరింత పట్టుదలలో ఉద్యమప్రచారాన్ని సాగించారు.

కయ్యూరు కామ్రేడ్సు కేసు

కామ్రేడ్ బ్రాడ్లీ "పీపుల్సువార్" పత్రికకు ఈ దిగువవార్త పంపాడు.

"కయ్యూరు కామ్రేడ్స్ అప్పీలు కేసులో పనిచేయడానికి ప్రిట్‌గారు అంగీకరించారు. కేసుకుసంబంధించిన వివరాలు వెంటనే వైర్‌చేయండి."

(కయ్యూరు కామ్రేడ్స్‌కి మద్రాసు హైకోర్టు మరణశిక్ష విధించింది. మరణ దండనను తొలగించి, కామ్రేడ్స్ ప్రాణాలను కాపాడవలసిందన్న అప్పీలును మద్రాసు గవర్నరు త్రోసివేశాడు. ఆపైని వైస్రాయిగారూ అంతే చేశారు. ఇప్పుడు ప్రీవీకౌన్సిలుకు అప్పీలు చేశారు. ప్రిట్‌గారికి కావలసిన విషయాలను తంతిమూలంగా వెంటనే పంపడమయింది.)

వివిధవార్తలు

చౌకడిపోలవల్లబీదలకు ఆహారపదార్థాలు అందుబాటులో వుండడం, వర్తకుల అధిక లాభాలు అరికట్టడం జరుగుతుందని యెవరైనా ఆశిస్తారు. కాని, బెజవాడలో యిదొక లాభసాటివ్యాపారంగా సాగిపోతోంది. ప్రభుత్వాధికారుల సలహాతో బెజవాడ వర్తకులు 1-0-0 కి 0-0-3 చొప్పున, నెలకు మొత్తం రు 16,000 పౌరులవద్ద కరవుపన్ను అనే పేరుతో వసూలుచేస్తున్నారు. ఈ ధనం చౌకడిపోలు నడపడానికి ఖర్చుచేయబడాలి కాని, వసూలుచేసిన యీ డబ్బును కరవుపన్ను కమిటీకి పూర్తిగా యివ్వక, తామే దిగమ్రింగి కూర్చుంటున్నారు. సబ్‌కలెక్టరు, సేల్సుటాక్సు ఆఫీసరు మొదలైన ప్రభుత్వాధికారులు యీ కమిటీలో సభ్యులు! ప్రజల కళ్ళనీళ్ళు తుడవడానికి తెరువబడ్డ డిపోలు 4. ఇక్కడ సరియైన బియ్యమియ్యరు. రోజు 1 కి 4 గంటలే వీటిని తెరుస్తారు. బియ్యం, నూకలు, అధమం ధాన్యమైనా చిక్కక, వేలకొలది ప్రజలు మూడు, నాలుగు గంటలు పడిగాపులు పడి, వెనక్కు వెళ్ళవలసివస్తోంది. డిపోలలో సప్లయిచేయబడు సరుకు బహు కొద్దిమందికి మాత్రమే సరిపోతుంది. జనసమ్మర్దంలో అనేకులకు గాయాలు తగులుతున్నాయి. కొందరు పోలీసులాఠీలకు గురి అవుతున్నారు.

ఈ దోపిడి విధానాన్ని అరికట్టడానికి బెజవాడ పట్టణ కమిటీ (భారత కమ్యూనిస్టుపార్టీ) తరపున కామ్రేడ్ వి. ఏ. శాస్త్రిగారు సబ్‌కలెక్టరు దగ్గరకు వెళ్ళి బహిరంగసభకు అనుమతిని కోరగా ఆ మహానుభావుడు యీ క్రింది జవాబు పంపాడు:

"ధరల కంట్రోలు, లాభాల సమస్య విషయమై మీరు గాంధీపార్కులో సభజరుపడానికి అనుమతిని కోరుచు 13-12-42 న వ్రాసిన జాబు అందినది.

"ధరలను కంట్రోలుచేయుటకు, అధిక లాభాలను అరికట్టుటకు యిదివరకే ప్రభుత్వం చర్యతీసుకొంటూన్నది. కాబట్టి, మీరు కోరిన సభలవంటి సభలు ఇప్పుడు జరపడం యుక్తం కాదని నా యభిప్రాయం. కాబట్టి సభ జరుపడానికి నేను అనుమతి నీయజాలనందుకు విచారిస్తున్నాను." సబ్ డివిజనల్ మేజస్ట్రేట్.

13-12-42

నిరంకుశాధికారులు యింత మొండి వైఖరితో ప్రవర్తిస్తే దేశంలో లూటీలు, అరాజకం హత్యలు వ్యాపించడంలో ఆశ్చర్యం లేదు.

స్టాక్ లేదని ప్రతిచోట అధికారులు దబాయిస్తున్నారు. కాని రు 10 లక్షల బియ్యం స్టాకును నలుగురు బొంబాయి వర్తకులు బెజవాడలో నిల్వచేసియుంచగా ఆ స్టాకును ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ఆంధ్రపత్రిక విలేఖరి (డిసెంబరు 11) వ్రాస్తున్నాడు. ప్రజా ప్రతినిధుల సహకారంతో యిట్టి కేసులు ప్రతిరోజూ వందలకొలది పట్టుకోవచ్చు. కాని సభలు జరుపుకోవడానికి అనుమతి ఇవ్వని అధికారవర్గం ఇందుకు పూనుకుంటుందా? అధమం ప్రభుత్వాధికారులు చౌకడిపోలకు తగినంత స్టాక్ సప్లయిచేసి, డిపోల సంఖ్యను ఎక్కువచేసి, పౌరులవద్ద వసూలు చేసే వేలకొలది ధనాన్ని బీదల ఉపయోగానికి ఖర్చుపెట్టవలసియుంది. ప్రజలందరు యిందుకు బలమైన ఒత్తిడి తేవలసియుంది.

ప్రెస్ కార్మికులకోర్కె

బెజవాడలో కనీసం 10 చౌకడిపోలు కూలీల పేటలలో స్థాపించాలనీ, రాత్రిగం 7-30 వరకు వాటిని తెరచియుంచాలనీ, ఇప్పుడు అమ్మే ధాన్యానికి బదులు బియ్యం అమ్మాలనీ, ప్రతియింటికి రేషనింగుకార్డులు సప్లయి చేయాలని, కోరుచు బెజవాడ ప్రెస్‌వర్కర్సు సాధారణ మహాసభ 13—12—42 న తీర్మానించింది.

అధికారదుర్వినియోగం

త్రణుకు తాలూకాలో మహిళాసంఘం శ్రీ కామ్రేడుని మహిళా వుద్యమం గురించి ప్రచారంచేస్తూ దొంగరాయపాలెం వెళ్ళారు. ఆ వూరిలో పెనుగొండ హెడ్‌కానిస్టేబులు వీరి దగ్గరకు వచ్చి వారి వూళ్ళు, పేర్లు, భర్తల పేర్లు అడిగి రాసుకోవడం ప్రారంభించాడు. ఇంతలో తాలూకా మహిళాసంఘ అర్గనైజరు అక్కడికి వచ్చి ఏమిటి రాసుకోడం అని అడిగాడు. దానిమీద అతని పేరూ, వూరూ కూడా రాసుకొని "ఈ వూళ్ళో వుండవద్దు వెళ్ళిపొండని గద్దించాడు. అంతటితో వూరుకోకుండా ఊళ్ళోవాళ్ళందరి దగ్గరకువెళ్ళి వీళ్ళకిదివరకు యెవరు భోజనం పెట్టారో అడిగి తెలుసుకున్నాడు. వీళ్ళ ఊళ్ళోనుంచి వెళ్ళగొట్టవలసిందని, లేకపోతే ప్రమాదం వస్తుందని బెదరించాడు. కాని కామ్రేడ్సు తమ పని పూర్తిచేసుకొన్న తరువాతనే అక్కడనుంచి కదిలారు.

జపాను రేపో మాపో మన దేశంమీదకు రానుంది. ఈ సమయంలో భారతనారీలోకం చైతన్యం పొంది, తన విధిని నెరవేర్చుకోవలసి వుంది. కాని, ఈ హెడ్‌కానిస్టేబిల్ మహాశయుల వంటివారు ఇంకా చాలమంది వుంటే జపాను ఫాసిస్టుల పని చాల సులకనవుతుందనడానికి సందేహంలేదు.

కొడుకుని పట్టుకోలేక తండ్రిఆస్తి జప్తుచేశారు

సంకు అప్పారావు అనే కామ్రేడ్ నవంబరు 30 తేదీని కోర్టులో హాజరు కావలసిందని భీమవరం కలెక్టరుగారు నోటీసు జారీచేశారు. అప్పారావు హాజరుకాలేదు. దానిమీదట అప్పారావు తండ్రి పొలములోని పంటను రివెన్యూయినస్పెక్టరు వేలంవేశాడు. ఎవరూపాడలేదు. వేలం వాయిదా వేశారు. అప్పారావు తండ్రికి తల్లి రాసియిచ్చిన ఆస్తేగాని, తండ్రిద్వారా ఏమీ రాలేదు. అందుచేత ఆ ఆస్తిలో అప్పారావుకు హక్కులేదు ఈ విషయాన్ని అధికారులు ముందుగా తెలుసుకున్నారో లేదో!

★ రోమెల్ పలాయనంచిత్తగించుతున్నాడు

★ ప్రపంచ యుద్ధసమీక్ష ★

దాదాపు అన్ని రంగాలలోను, సోవియటు దాడులు సాగుతూనే వున్నాయి. స్టాలిన్‌గ్రాడ్ రంగంలో జర్మన్లు రెండు వలయాలలో చిక్కుకొని వున్నారు. మొదటిది డాన్, వాల్గా నదుల మధ్య త్రికోణప్రదేశం. రెండవది డాన్ మలుపు వెనుక. ఈ రెండు వలయాలలోను చిక్కిన జర్మను సైన్యాలు క్రమక్రమంగా హతమార్చబడుతూనే వున్నాయి. అదనపు సైనిక సాధన సహాయంకోసం జర్మనీ విశ్వప్రయత్నం చేస్తోంది. స్టాలిన్‌గ్రాడ్ రంగంలోను, స్టాలిన్‌గ్రాడ్‌కు దక్షిణాన కొటెల్నికోవ్ - కాల్మక్ ప్రదేశాలను. మధ్యరంగంలోను జర్మన్లు గావించే ఎదురుదాడులను తరిమి కొడుతున్నాయి సోవియటు సైన్యాలు.

స్టాలిన్‌గ్రాడ్ నగరంలో మరికొన్ని భవనాలను సోవియటు సైన్యాలు ఆక్రమించాయి. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యంగా, డాన్‌నది పశ్చిమతీరాన ఒక జర్మన్ ముఖ్యప్రదేశాన్ని సోవియటు సైన్యాలు ఆక్రమించాయి. రెజెవ్‌కు పశ్చిమంగా జర్మను రక్షణశ్రేణిని రెడ్ఆర్మీ భేదించింది. ట్వాప్సీ, నాల్చిక్ ప్రదేశాలలో గూడ, జర్మను దాడులను సోవియటు అరికట్టుతోంది. మోజ్‌డాక్ ప్రాంతంలో, తన పరిస్థితిని అభివృద్ధి గావించుకోవడానికి, సోవియటు ప్రయత్నించుతోంది. [స్టాక్‌హోం, బెర్లిన్ వార్తలనుబట్టి వొరోనెజ్, కాలినిన్ రంగాలలో యుద్ధజ్వాలలు లేచాయి] ఇల్మెన్ సరస్సుకు దక్షిణంగా కూడ సోవియటు సైన్యాలు జర్మన్ల రక్షణలలో గండిగొట్టాయి.

రెజెవ్, స్టాలిన్‌గ్రాడ్, కొటెల్నికోవ్ ప్రదేశాలలో శత్రువు తీవ్ర ప్రతిఘటన చేస్తున్నాడు. టాంకుబలాన్ని వుపయోగించాడు. సోవియటు వైమానికదళం యీ జర్మను తిరుగుదాడులను హతమార్చుటలో సహాయపడుతోంది.

ఇజ్వెస్టియా విలేఖరి చెప్పినట్లు "శత్రువు ప్రతిఘటనా శక్తి నశించిందనుకోడం పొరబాటు. దెబ్బతిన్న మృగం చాల అపాయకరమైంది." ఈ విషయం గుర్తుంచుకొనే సోవియటు సైన్యాలు జర్మన్లను నిహతుల్ని గావించుతున్నాయి.

జర్మను నష్టాలు

సోవియటు ఎదురు దాడులు ప్రారంభమయినది నవంబరు 19 వ. నాటినుండి. డిశంబరు 11 లోగా స్టాలిన్‌గ్రాడ్ రంగంలో 72,400 మంది ఖైదీలు చేజిక్కారు. 94,000 కు పైగా జర్మన్లు, రుమేనియన్లు చచ్చారు. మధ్య రంగములో నవంబరు 25నుండి డిశంబరు 11లోగా 75 వేలమంది జర్మన్లు చనిపోయారు. 2 లక్షల మందిగాయ పడ్డారు.

సోవియటు లక్ష్యం

మధ్యరంగంలో రెజెవ్, వెలికి లుకీ, వ్యాజ్మాలను పట్టుకుంటే, స్మోలెన్స్కుకు రహదారి లభ్యమవుతుంది. ఇదే తర్వాత లెనిన్‌గ్రాడ్‌ను ముట్టడినుండి విముక్తి చేయడానికి సహాయపడుతుంది.

స్టాలిన్‌గ్రాడ్ ముందరను, డాన్ మలుపులోను చిక్కొన్న జర్మన్లను సర్వనాశనంచేయగల్గినట్లయితే, సోవియటు సైన్యాలు రోస్టావ్ ఆక్రమణకు ప్రయత్నించుతాయి. రోస్టావ్ ఆక్రమణతో ఉత్తర కాకసస్‌లోని జర్మను సైన్యాలు సోవియటు వలయములో చిక్కుంటాయి.

ఆఫ్రికా

బిజర్టా, ట్యూనిస్‌ల మధ్య రైల్వే లైనను భేదించి చాల దినాలయింది ఐనా పై రెండు పట్టణాలకై తీవ్ర యుద్ధం యింకా ప్రారంభం కాలేదు. ఇటీవల జర్మన్లు, మెడ్‌జెజ్ ఎల్ బాబ్ వైపుకు పంపిన రెండు టాంకుదళాలపై మిత్రమండలి సైన్యాలు దెబ్బతీశాయి. జర్మను ప్రయత్నం విఫలమయింది.

లిబియాలో, ఎల్ అఘేలాను డి రోమెల్ పలాయనం చిత్తగించుతున్నాడు. బ్రిటిషు సైన్యాలు వెను దరుముతున్నాయి.

బిజర్టా, ట్యూనిస్‌లను ఆక్రమించుకొన్నా ఆఫ్రికాలో ఒక అంగుళం తనకు లేకపోయినా సిసిలీ, సార్డీనియాలనుండి విమాన కేంద్రాల సహాయంతో మిత్రమండలిపై గట్టి దెబ్బలనే జర్మనీ తీయగలదని "సోవియటు వార్‌న్యూస్" ప్రకటించుతోంది (ఈ పత్రిక లండన్‌నుండి వెలువడుతుంది) బిజర్టా, ట్యూనిసులను బట్టుకొని, యిపుడు ఎల్అఘేలానుండి కాళ్ళకు బుద్ధిచెప్పిన రొమెల్‌ను ట్రిపోలీనుండికూడ తరిమివేస్తే ఉత్తర ఆఫ్రికా పూర్తిగా మిత్రమండలికి దక్కుతుంది. సిసిలీ, సార్డీనియా, దక్షిణ ఇటలీలలోని విమాన నౌకా కేంద్రాల నుండి వచ్చే అపాయాన్ని తొలగించితేగాని మధ్యధరా సముద్ర మార్గం పరిశుభ్రం కాదు. అందుకు యిదివరలో చర్చిలు చెప్పినట్లు ఇటలీపైన శాస్త్రీయ పద్ధతులతోను క్రమ పద్ధతిని బాంబులు వేయుటతోనే చాలదు. "సోవియటు వార్‌న్యూస్" చెప్పినట్లు "అది తప్పనిసరిగా ఇటలీకోసం యుద్ధంగా మారాలి. అపెన్నైన్ ద్వీపకల్పం (ఇటలీ దక్షిణభాగం) లో మిలిటరీ చర్యలు జరగవలసి వుంటుంది."

రెండవ రంగం

ఉత్తర ఆఫ్రికాలోని ఈ యుద్ధక్రమం, ఇటలీ ఫ్రాన్సులలో భూయుద్ధానికి దారితీయాలి. అందుచేతనే రెండవరంగం వచ్చినప్పుడు దెబ్బ తీయడానికి రిజర్వుచేసిన సోవియటు సైన్యాలు ఇపుడే ముందుకు కదిలాయి. ఇట్టిసమయంలో రెండవరంగం ఫ్రాన్సు, ఇటలీలలో కల్పించడం అవసరం. ఇది ప్రజలు వాంఛిస్తున్నారు. ఇదే సోవియటు కోరుతుంది. ఇలాంటి సంయుక్త కార్యాచరణవల్లనే విజయం త్వరితంగా లభిస్తుంది.

ప్రజలలో విశ్వాసముంచితే, ప్రజాపంథా అవలంబిస్తే, మిలిటరీ కష్టాలుకూడ నశించుతాయి. ఆఫ్రికా వలస ప్రజలకు విముక్తి గలిగించి, స్వాతంత్ర్య సమానహక్కుల నిస్తే ఫ్రెంచి, మూర్, ట్యూనిసియన్, ఆఫ్రికన్ ప్రజలతో గూడిన హిట్లరుప్రతికూలసైన్యం తయారుచేయాలి. అలా చేసిననాడు, ఫ్రాన్సు ఇటలీలలో ప్రజా తిరుగుబాటుకు, దోహదమిస్తుంది. కాని ఫ్రాన్సు ఇటలీలలో ప్రజా విప్లవాలను గాని, బానిసప్రజల విముక్తినిగాని వాంఛించని సామ్రాజ్యవాదులు రెండవరంగాన్ని తెరచుటలేదు. ఇదివరలో మిలిటరీ కష్టాలను పెద్దవిగా ప్రదర్శిస్తూ వచ్చినవారే, ఇపుడు, హిట్లరు ముసోలినీల పరాజయ ఫలితంగా వచ్చే రాజకీయ పరిస్థితులకు భయపడుతున్నారు. డార్లాన్ ఉదంతమే ఇందుకు ఉదాహరణ.

డార్లాన్

డార్లాన్‌తోటి కుట్ర, ప్రజలు కోరే సంయుక్త వ్యూహాన్ని, రెండవరంగం తెరిచే ప్రయత్నాన్ని కుంటుపరుస్తోంది.

డార్లాన్‌ను గురించి, బహిరంగంగా చర్చించనీయలేదు. రహస్యంగా బ్రిటిషు పార్లమెంటులో చర్చ జరిగింది. డార్లాన్, తాను ఫ్రెంచి ఉత్తరాఫ్రికాకునాధుడనని ప్రకటించుకున్నాడు. ఇంతేగాదు గవర్నర్ల, మిలటరీ కమాండర్లతో గూడిన ఒక "ఇంపీరియల్ కౌన్సిల్"ను గూడ ఏర్పరచాడు. దానిపై బ్రిటన్, అమెరికా ప్రజలలో తీవ్ర అసంతృప్తిచెలరేగింది. మెయిస్కీ, లిట్వినావ్‌లు బ్రిటీష్ అమెరికన్ ప్రభుత్వాలను సందర్శించి, తమ దేశ విముఖతను తెలియజేశారు. సోవియటు పత్రికలు నిర్మొగమాటంగా, డార్లాన్ పరిస్థితియేమిటి? అని నిలవదీసి అడుగుతున్నాయి.

డార్లాన్ ఫ్రెంచి ఆఫ్రికా ఆధిపతి అవడం వల్ల గలిగే రాజకీయ పర్యవసానాలేమిటి?

(1) ఫ్రెంచి ఆఫ్రికా వలసప్రజలకు విముక్తిలేదు. వలస ప్రజలకు విముక్తి లేనిదే ఫ్రాన్సు విముక్తికై హిట్లరు ప్రతికూల ఫ్రెంచిసైన్యం నిర్మింపబడజాలదు.

(2) హిట్లరు ప్రతికూల ఫ్రెంచి ప్రజాసంఘటనలో చీలికలు వస్తాయి. రష్యా బ్రిటన్, అమెరికాలు, డిగాలీని స్వతంత్ర ఫ్రాన్సుకోసం యుద్ధంచేసే నాయకునిగా గుర్తించాయి. ఇప్పుడు డార్లాన్ వైఖరిపై ఉపేక్షించడంవల్ల, చీలికలువస్తాయి.

(3) ఫ్రాన్సు విముక్తికై పోరాడేవారిలో డార్లాన్‌ను తెచ్చిపెట్టడం ఆ ఆశయానికేదెబ్బ గొట్టడం. ఫ్రాన్సు విముక్తికే హానికల్గించడం.

అందుచేతనే ప్రపంచమంతటా యీ అసంతృప్తి." డార్లన్‌తోటి సంధితో అమెరికా నైతిక శక్తిని కోల్పోయిందని" విల్కీ అన్నాడు. డీగాలీ "నాజీలకు సలాములు గొట్టి సహకారం చేసి అధికారం కాజేసిన ముఠాను ప్రతిబింబించిన వారిని ఫ్రాన్సు క్షమించదు" అన్నాడు. జనరల్ కాట్రో "ట్యునీషియాలో యుద్ధంచేయుచున్న మిత్రమండలి వెనుకభాగంలో డార్లన్‌ను ఉండనీయడం అపాయకరమైనదే. ఆఅపాయం డార్లాన్‌ను తొలగించుటద్వారానే పోతుంది."

అట్టి లక్షణాలకు ఉదాహరణ, రాబాట్ రేడియో కేంద్రాన్ని అమెరికా నుపయోగించుకొన నీయకపోవడంలోనే తెలుస్తుంది. న్యూయార్కు హెరాల్డు ట్రిబ్యూన్‌కూడ "ఫ్రాన్సు యుద్ధ వైఖరిలో చీలికలకు కారణమైన విషీ చచ్చిపోయింది. కాని డార్లన్ అనే వ్యక్తి రూపంలో మరల ఉత్తర ఆఫ్రికాలో తలమెత్తింది. అంతకంటెకూడ దుష్ఫలితాలను కలుగజేసేటట్లు వుంది." అని వ్రాసింది.

30 లక్షలతోటి డార్లన్ ఏమిచేయగలడులే అని కార్డెలుహల్ త్రోసిపుచ్చడం మంచిది కాదు. ఫ్రెంచి ప్రజలపై తమ కిష్టంలేని పద్ధతిని డార్లన్ రుద్దకుండా చూస్తామని అమెరికా చేసే వాగ్దానం చాలదు. డార్లాన్‌ను సహించగూడదు, క్షమించగూడదు. తొలగించాలి. ఫ్రెంచి రహస్య పత్రిక "లా ఫ్రాన్సు" వ్రాసినట్లు "కొందరు తమ దోషాలను కప్పిపుచ్చుకొనే ఆశతో ఆఫ్రికా వెళ్ళారు. కాని ఫ్రెంచి ప్రజల జ్ఞాపక శక్తి అంత తక్కువదిగాదు. ఫ్రెంచి ప్రజలు గ్రుడ్డివారుకాదు, చెవిటివారూ కాదు."

దక్షిణ పసిఫిక్‌లో

దక్షిణ పసిఫిక్‌లో జపాన్ అమెరికాల దాగుడుమూత యుద్ధాలు యింకా సాగుతూనే వున్నాయి. గ్వాడల్‌కనార్ నుండి సోలమన్సు నుండి జపాను అమెరికాను తొలగించలేకపోయింది. జపాను అనేక నౌకలను కోల్పోతూ వచ్చింది. అమెరికన్ సైన్యాలు న్యూగినియాలో "గోనా"ను ఆక్రమించాయి. బూనానుండి జపానును తరుమగొట్ట ప్రయత్నించుచున్నారు. ఆస్ట్రేలియా న్యూజిలాండ్‌లతో అమెరికా రహదారులను తెగగొట్ట దలచిన జపాను ప్రయత్నం యింకా ఫలించలేదు. అందుచేతనే వెనుభాగం రక్షించుకోవలసిన అవస్థలో పడినది కాకాసస్ ద్వారా యిండియాకు జర్మను సైన్యాలు రాకపోవడం కూడ జపాను చేతులు ముడుచుకు కూర్చునేటట్లు చేసింది బ్రిటిషు, అమెరికా సైన్యాలు యీ వ్యవధిలో విమాన బలాన్ని, ఆయుధ బలాన్ని బలపరచుకున్నాయి. ఇందుకు బర్మాపై జరిపే దాడులే నిదర్శనం

బర్మాలో సాల్వీను నదిఒడ్డున 6 డివిజన్ల సైన్యాలను చేర్చినట్లు వార్త. ఇటీవల జపాను, యూనాన్ సరిహద్దులో ప్రవేశించ ప్రయత్నించింది. పెద్దఎత్తున దాడి సల్పకపోయినా, చైనీయులు ఈ జపాను దాడిని తరుమగొట్టారు. కాబట్టి యూనాన్ సరిహద్దు ఘర్షణలు, యూనానువైపుకు జపాను దృష్టి మరలిందా అని అనిపిస్తుంది. ఇండియాపైకో, యూనాన్ పైకో జపానుదాడి తప్పదు.

— కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

15—12—42.

సమిష్ఠి వ్యవసాయ క్షేత్రం

శ్రీ జి. కుటుంబరావుగారు "రాడికల్" పత్రికలో సంగం జాగర్లమూడి సమిష్ఠి వ్యవసాయ క్షేత్రాన్ని గూర్చి చేసిన ప్రకటన కేవలం అసత్యాలతో కూడుకున్నది. వారు సంగం జాగర్లమూడి వచ్చి చూచివెళ్ళి, యిలాంటి ప్రకటన చేశారని మేము నమ్మము. వీరు సమిష్ఠి వ్యవసాయ క్షేత్రాన్ని విచ్ఛిన్నంజేస్తానికి చేసిన యీ ప్రకటన కమ్యూనిస్టు పార్టీపై ద్వేషంచేతనేగాని యదార్ధ విషయాలను తెలుసుకొనిగాదు. శ్రీ కుటుంబరావుగారు మా గ్రామం దయచేసి వ్యవసాయ కూలీ సంఘకార్యకర్తలను గాని, యువజన సంఘ కార్యకర్తలనుగాని, లైబ్రరీ అధికారులనుగాని కలిసికొన్నచో వారికి సకల విషయములు బోధపడగలవు.

ఇట్లు,
వీరమాచనేని భగవన్నారాయణ.
కార్యదర్శి.
సర్వజన విద్యప్రదాయినీ పుస్తక భాండాగారం, సంగం జాగర్లమూడి.
కొత్త హనుమంతరావు,
కార్యదర్శి,
యువజన సంఘం, సంగం జాగర్లమూడి.

Published by Katragadda Rajagopala Rao, and Prinetd by The Popular Printers, Governorpet, Bezwada.

END OF ISSUE